RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 195 ఆదివారం 10 ఆగష్టు 2025 పేజీలు : 4

## భారీ వర్షాలు.. 18 మంది మృతి

ముంబై: మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వీటి కారణంగా 18 మంది మృతి చెందారు. 65 మంది గాయపడ్డారు. ఈ మేరకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. భారీ వర్షాలు, రోడ్డు ప్రమాదాలు, పిడుగుపాటు, నీట మునిగి పోవడం కారణాల వల్ల ఈ మృతులు సంభవించాయని వివరించింది. రాష్ట్రవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని.. ఈ నేపథ్యంలో గత 24 గంటలుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని చెప్పింది. రాజధాని ముంబై మహానగరంతోపాటు ముంబై శివారు ప్రాంతం, రత్నగిరి, సిందుదుర్గ్, రాయ్‌గఢ్ తదితర జిల్లాల్లో భారీగా వర్షం కురిసిందని తెలిపింది. మరోవైపు పశ్చిమ మహారాష్ట్రలోని అరంజ్ అలర్ట్ జారీ చేసినట్లు పేర్కొంది.



# ట్రంప్‌కు భారత్ బిగ్ షాక్..

## బెదిరింపులకు భయపడదే లేదంటూ స్ట్రాంగ్ వార్నింగ్

## భారత్ అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరన్న పీయూష్ గోయల్!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 50 శాతం సుంకం విధించిన విషయం తెలిసిందే. దీని తర్వాత ట్రంప్ భారత్‌ను బెదిరింపులకు పాల్పడ్డాడు. అయితే వీటికి భయపడేది లేదని ట్రంప్‌కు భారత్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఉడత ఊపులకు భారత్ భయపడదని, ఎన్ని టారీఫ్‌లు వేసినా వెనక్కి తగ్గేది లేదని భారత్ రిటర్న్ వార్నింగ్ ఇచ్చింది. వాణిజ్య ఒత్తిళ్లకు భారత్ వెనకడుగు వేయదని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. భారత్ 6.5 శాతం వృద్ధితో దూసుకెళ్తోంది. ఎన్ని టారీఫ్స్ వేసుకున్నా ఈ ఏడాది ఎగుమతులు పెరుగుతాయని గోయల్ అన్నారు. యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ – EFTA తో 100 బిలియన్ల పెట్టుబడులు, 10 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలు లభిస్తాయయని గోయల్ అన్నారు. అనేక దేశాలతో కొత్త వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నామని గోయల్ తెలిపారు.

**వాణిజ్యపరంగా వృద్ధి చెందుతుందని..** ప్రపంచ వాణిజ్య సంఘాలతో భారతదేశం అభివృద్ధి సాధిస్తోంది. ప్రతీ ఏటా ఆరున్నర శాతం వృద్ధి చెందుతోందని పీయుష్ గోయల్ అన్నారు. వాణిజ్య అడ్డంకులను ఎదుర్కోవడానికి ఇప్పటికే చర్యలు అమలులో ఉన్నాయని తెలిపారు. భవిష్యత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల గురించి మాట్లాడుతూ, భారతదేశ విధానం కేవలం సుంకాల రాయితీలను కోరడం కంటే ఎక్కువగా అభివృద్ధి చెందిందని గోయల్ అన్నారు.

నాలుగు దేశాల EFTA కూటమితో జరిగిన చర్చలను తెలపుతూ.. USD 4 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తోందని పీయూష్ గోయల్ తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి EFTA ఒప్పందం అమల్లోకి రానుందని తెలిపారు. రాబోయే సంవత్సరాల్లో భారతదేశం యుఎఇ, మారిషస్, ఆస్ట్రేలియా, ఇఎఫ్‌టిఎ బ్లాక్, యుకె, ఇయు, చిలీ, పెరూ, న్యూజిలాండ్, యుఎస్ మరిన్ని దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటుందని గోయల్ అన్నారు. భారతదేశం ఆర్థిక స్థితిస్థాపకతను హైలైట్ చేస్తూ, దేశ కరెన్సీ, విదేశీ మారక నిల్వలు, స్టాక్ మార్కెట్లు, ఫండమెంటల్స్ బలంగా ఉన్నాయని తెలిపారు.

ఇతర అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే ద్రవ్యోల్బణం ప్రపంచంలోనే అత్యల్పంగా ఉందని గోయల్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వంటి గొప్ప నాయకుడు నేతృత్వంలో భారతదేశం ఇప్పుడు అభివృద్ధి చెందుతూ గౌరవంగా ఉందన్నారు.



## మల్లారెడ్డి సంచలనం.. రాజకీయాలకు గుడ్‌బై..!

హైదరాబాద్ : రాజకీయాలపై మాజీ మంత్రి మల్లారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇవాళ హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మీడియాతో మల్లారెడ్డి మాట్లాడారు. తాను రాజకీయంగా బీజేపీ వైపా, తెలుగుదేశం వైపా, బీఆర్ఎస్ పార్టీల వైపా అన్నది కాదని... తాను ఇప్పటికీ కూడా బీఆర్ఎస్‌లోనే ఉన్నానని క్లారిటీ ఇచ్చారు మల్లారెడ్డి. తాను ఇప్పుడు ఏ వైపునకు చూసేటట్లుగా కూడా లేనని స్పష్టం చేశారు. తనకు 73సంవత్సరాలు వచ్చాయని.. ఇంకా ఏవైపునకు చూడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. తాను ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రిని అయ్యానని ఇంకా మూడేళ్లు రాజకీయాల్లో ఉంటానని చెప్పుకొచ్చారు. అస్సలు తాను రాజకీయమే వద్దనుకుంటున్నానని తెలిపారు. ప్రజలకు సేవ చేసి మంచి కాలేజీలు, యూనివర్సిటీలు నడిపిద్దామని అనుకుంటున్నానని మల్లారెడ్డి పేర్కొన్నారు.




## మహిళల రక్షణ మా బాధ్యత.. సీఎం చంద్రబాబు, రేవంత్‌రెడ్డి రాఖీ శుభాకాంక్షలు

అమరావతి, ఆగస్టు9 : రాఖీ పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి ట్వీట్ చేశారు. 'నా తెలుగింటి ఆడపడుచులకు, నా ప్రియమైన అక్కాచెల్లెళ్లకు రాఖీ పండుగ శుభాకాంక్షలు. అన్నా చెల్లెళ్ల అనుబంధం వ్యక్తం చేస్తూ 'నీ కోసం నేనున్నాను' అనే భరోసా కల్పించే శుభ సందర్భమే రాఖీ పర్వదినం. అందుకే రాఖీ పౌర్ణమి మనందరికీ ప్రత్యేకం. మీ అందరికీ ఒక అన్నగా మీకు రక్షణ కల్పించే, మీ జీవితాల్లో వెలుగులు నింపే బాధ్యత నాది అని రాఖీ పండుగ సందర్భంగా మరోసారి ప్రకటిస్తున్నాను. ఆడబిడ్డల రక్షణ కోసం అహర్నిశలూ పని చేస్తానని హామీ ఇస్తూ అందరికీ మరొక్కమారు రాఖీ పండుగ శుభాకాంక్షలు' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.




## హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్లలో భారీగా ట్రాఫిక్ జామ్

హైదరాబాద్, ఆగష్టు 9 : హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్లలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వేలాది వాహనాలతో హైదరాబాద్ శివారు ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. పలు రహదారుల్లో కిలోమీటర్ కదిలేందుకు గంటకుపైగా సమయం పడుతోంది. హైదరాబాద్–విజయవాడ హైవేపై కూడా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వీకెండ్, రాఖీ పౌర్ణమితో సొంతూళ్లకు నగరవాసుల పయనం కావడంతో ఈ పరిస్థితి తలెత్తింది. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. ఉప్పల్–వరంగల్ హైవే పైనా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో హైవేపై వాహనాలు చాలా నెమ్మదిగా కదులుతున్నాయి. అటు, బస్టేషన్లు, రైల్వే స్టేషన్లలో పెద్ద ఎత్తున ప్రయాణీకులు బస్సులు కోసం ఎదురు చూస్తున్నారు. పిల్లా పాపలతో పండుగ జరుపుకునేందుకు పెద్ద ఎత్తున జనం తమ సొంత ఊళ్లకు ప్రయాణమవుతున్న దృశ్యాలు దాదాపు నగరమంతా కనిపిస్తున్నాయి.




## కేసీఆర్‌కు రాఖీ కట్టిన సోదరీమణులు..

### అక్కలు, చెల్లె కాళ్లుమొక్కిన గులాబీ దళపతి, కనిపించని కవిత

హైదరాబాద్ : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు.. ఆయన సోదరీమణులు రాఖీ కట్టారు. రక్షా బంధన్ సందర్భంగా కేసీఆర్ అక్కలు లక్ష్మీబాయి, జయమ్మ.. చెల్లెలు వినోదమ్మ ఆయనకు రాఖీ కట్టారు. ఏటా రాఖీ పండగ రోజు కేసీఆర్‌కు ఆయన సోదరీమణులు రాఖీలు కడుతూనే ఉన్నారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్లిన ఆయన సోదరీమణులు.. రక్షాబంధన్ వేడుకలు జరుపుకున్నారు. కేసీఆర్‌కు హారతి పట్టి, రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించారు.

ఈ సందర్భంగా కేసీఆర్ తన సోదరీమణుల కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకున్నారు. అయితే ఈ రాఖీ వేడుకలకు కేసీఆర్ కుమార్తె, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దూరంగా ఉండటం గమనార్హం. గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్‌కు, కేసీఆర్ కుటుంబానికి దూరంగా ఉంటున్న కల్వకుంట్ల కవిత.. ఇవాళ కూడా రాకపోవడం గమనార్హం. అయితే కేటీఆర్ ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్నారని.. అందుకే ఆయన అందుబాటులో లేకపోవడం వల్లే కవిత రాఖీ కట్టలేదని బీఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి.




## మాటలతో నిర్వచించలేనిది మా అనుబంధం : సీఎం రేవంత్

హైదరాబాద్: రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణ మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలో మంత్రి సీతక్క రేవంత్ రెడ్డి నివాసానికి చేరుకుని ఆయనకు రాఖీ కట్టారు. అనంతరం మంత్రి సీతక్కతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు రేవంత్. సోదరి సీతక్క పట్ల ఉన్న అనురాగాన్ని ప్రతిబింబిస్తూ.. ఎక్స్ వేదికగా సీఎం ఎమోషనల్ పోస్ట్ పెట్టారు.

'అక్షరాలతో రచించలేనిది... మాటలతో నిర్వచించలేనిది... సీతక్కతో నా అనుబంధమని, ప్రతి రాఖీ పౌర్ణమి నాడు ఆ బంధం మరింతగా వికసిస్తూనే ఉంటుందంటూ'.. సీతక్కతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగానికి లోనైయ్యారు సీఎం రేవంత్. తనకు రాఖీ కట్టిన మంత్రి కొండా సురేఖ, సీనియర్ నాయకురాలు గీతారెడ్డి, మహిళా కమిషన్ ఛైర్మన్ నేరెళ్ల శారద, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ సుజాతకు ఈ సందర్భంగా సీఎం ధన్యవాదాలు తెలిపారు.



## తెలంగాణలో రూ.80 వేల కోట్ల పెట్టుబడులకు ఎన్టీపీసీ సిద్ధం

హైదరాబాద్: తెలంగాణలో రూ.80వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) సంసిద్ధత వ్యక్తం చేసింది. ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్ బృందం శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసింది. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగంలో పెట్టుబడులు పెట్టనున్నట్లు వివరించింది. సోలార్, పవన విద్యుత్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు ఎన్టీపీసీ సుముఖత తెలిపింది. రాష్ట్రంలో 6,700 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ఉత్పత్తికి అవకాశం ఉందని సీఎంకు ఎన్టీపీసీ బృందం తెలిపింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అన్ని విధాలా సహకరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

## సంపాదకీయం

# కొత్త ఐటీ పన్ను బిల్లుపై కేంద్రం ఎందుకు వెనక్కి తగ్గింది?

ఆరు దశాబ్దాల పాత ఆదాయపు పన్ను చట్టం 1961కి బదులుగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఆదాయపు పన్ను బిల్లు 2025ని తాజాగా వెనక్కి తీసుకుంది. ఈ నిర్ణయం పార్లమెంట్‌లో అధికారికంగా ప్రకటించారు. అయితే ఈ బిల్లును మరింత మెరుగ్గా, అప్‌డేట్ చేసి ఆగస్టు 11న మళ్ళీ లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

**–బిల్లు వెనక్కి తీసుకోవడానికి ప్రధాన కారణం ఏమిటి?...** ఈ ఏడాది ఫిబ్రవరి 13న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ కొత్త బిల్లుపై విపక్షాలు పలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. దీంతో ప్రభుత్వం ఈ బిల్లును అధ్యయనం చేసి, అవసరమైన మార్పులు సూచించేందుకు ఒక సెలెక్ట్ కమిటీకి పంపింది. ఈ కమిటీ జులై 21న తన నివేదికను సమర్పించింది. ఆ నివేదికలో 285 ప్రతిపాదనలు, దాదాపు 4500 పేజీల సమాచారం ఉన్నాయి. ఈ భారీ నివేదిక ఆధారంగా పాత బిల్లును ఉపసంహరించుకుని, సెలెక్ట్ కమిటీ సూచనలన్నింటినీ కలుపుకుని అప్‌డేటెడ్ వెర్షన్‌ను సిద్ధం చేయడమే సరైన నిర్ణయమని కేంద్రం భావించింది.

**సెలెక్ట్ కమిటీ ముఖ్య సిఫార్సులు ఏమిటి?...** సెలెక్ట్ కమిటీ చేసిన కొన్ని కీలక సిఫార్సులు ఇవి.. ఇంటి అద్దెలపై పన్ను చెల్లించే వారికి కొన్ని మినహాయింపులు ఇవ్వాలని సూచించింది. ప్రస్తుతం సొంత ఇంటికి మాత్రమే వర్తించే గృహ రుణ వడ్డీపై పన్ను మినహాయింపును, అద్దెకు ఇచ్చే ఇళ్లకూ వర్తించేలా చేయాలని సిఫార్సు చేసింది. రీఫండ్ ప్రక్రియ వేగవంతం చేయాలని.. TDS (TDS), TCS (TCS%) రీఫండ్ ప్రక్రియను వేగవంతం చేసి పన్ను చెల్లింపుదారులకు మరింత సులభతరం చేయాలని సూచించింది.

**–కొత్త బిల్లులో ఏముండబోతోంది?...** ఆగస్టు 11న ప్రవేశపెట్టబోయే కొత్త బిల్లు పాత బిల్లులోని ప్రధాన లక్షణాలను కొనసాగిస్తుంది. అయితే, ఇందులో సెలెక్ట్ కమిటీ చేసిన ముఖ్యమైన సిఫార్సులు అన్నీ పొందుపరుస్తారు. ఈ బిల్లు పన్ను చెల్లింపుదారులకు మరింత స్పష్టత, సౌలభ్యం కల్పించేలా ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. ఈ కొత్త చట్టం సాంకేతికతను ఉపయోగించుకుని, పన్నుల విధానాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మారుస్తుందని ఆశిస్తున్నారు.

**– పాత చట్టం ఎందుకు సంక్లిష్టంగా మారింది?...** 1961లో రూపొందించిన పాత చట్టానికి గత ఆరు దశాబ్దాల్లో దాదాపు 66 బడ్జెట్‌లలో అనేక సవరణలు జరిగాయి. దీనివల్ల చట్టం చాలా విస్తృతంగా, సంక్లిష్టంగా మారింది. ఇది పన్ను చెల్లింపుదారులకు మరింత భారంగా మారింది. ఈ సమస్యను పరిష్కరించడానికే కేంద్రం ఒక కొత్త, సరళమైన చట్టాన్ని తీసుకురావాలని సంకల్పించింది. ఈ కొత్త చట్టంలో పాత చట్టంలోని 819 సెక్షన్లకు బదులుగా కేవలం 536 సెక్షన్లు మాత్రమే ఉంటాయి. పాత చట్టానికి బదులుగా కొత్త, సరళమైన చట్టాన్ని తీసుకురావాలన్న కేంద్రం నిర్ణయం స్వాగతించదగినది. ఇది పన్నుల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుంది. ఆగస్టు 11న రాబోయే కొత్త బిల్లు ఎలాంటి మార్పులతో ఉంటుందో, అది ప్రజలకు ఎంత వరకు ప్రయోజనకరంగా ఉంటుందో అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఘనంగా సోదరీ సోదరుల అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే రక్షాబంధన్ వేడుకలు



శామీర్ పేట, (గరుడ వార్త) : సోదరి, సోదరులు అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే రాఖీ పండుగ వేడుకలను ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. శనివారం ఉమ్మడి శామీర్ పేట మండలంలో రాఖీ పండగను ఎంతో ఉత్సాహంగా నిర్వహించుకున్నారు.



శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపల్, అలియాబాద్ మున్సిపల్, మూడు చింతలపల్లి మున్సిపల్ పరిధిలో ఉదయం నుంచి రాత్రి వరకు రాఖీలు కట్టాలనే ఉత్సాహంతో మహిళలు, యువతులు సోదరుల ఇండ్ల వద్దకు తరలి వెళ్లారు. స్వీట్ దుకాణాలు, రాఖీ దుకాణాల వద్ద జనాలు గుంపులుగా కనిపించారు. రాజీవ్ రహదారిపై వాహనాలు రద్దీగా కనిపించాయి. కొందరు ఉదయాన్నే ఆలయాలకు వెళ్ళి రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



# ఏడేళ్లయినా అసంపూర్తి నిర్మాణమే!



మెట్‌పల్లి : మెట్‌పల్లి ప్రభుత్వ కళాశాల నూతన భవన నిర్మాణం ఏళ్ల తరబడి అసంపూర్తిగా నిలిచిపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 2018లో రూ.2.63 కోట్లు మంజూరు కాగా పనులు ప్రారంభించారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి 2023లో ఇంటర్ బోర్డు నుంచి రూ.60 లక్షలు మంజూరు చేశారు. మూడు అంతస్థుల భవనాన్ని నిర్మించి సుమారు 15 గదుల వరకు నిర్మించాల్సి ఉంది. ఏడేళ్లయినా పనులు పూర్తి కావడం లేదు.

**అసంపూర్తిగా పనులు**

భవన నిర్మాణ పనులు నిలిచిపోయి విద్యుత్తు, నీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మూత్రశాలలు నిర్మించినా వినియోగంలో లేకుండా పోయాయి. తరగతి గదులకు కిటికీలకు బిగించక పోగా, కళాశాల చుట్టూ కోతులు తిరుగుతుండటంతో విద్యార్థులు భయంభయంగా పాఠాలు వినాల్సి వస్తోంది.

**పెరిగిన విద్యార్థులు.. అరకొర వసతులు**

ఈ ఏడాది కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్న లక్ష్యంతో అధ్యాపకులు ఇంటింటికీ తిరిగి చేర్పించారు. ప్రస్తుతం ఇంటర్ మొదటి, రెండో సంవత్సరాలకు సంబంధించి మొత్తం 535 మంది విద్యార్థులున్నారు. కొత్త భవనంలో మొత్తం 15 గదులకు 10 మాత్రమే నిర్మించారు. ఇందులో రెండింటిని ఉన్నత పాఠశాలకు కేటాయించడంతో 8 గదులను వినియోగిస్తున్నారు. వాటిలోనూ పనులు పూర్తి కాక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

**బడి భవనం తొలగింపుతో కొత్త చిక్కులు**

కళాశాల ప్రాంగణంలోనే ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల ఉంటుంది. భవనం శిథిలావస్థకు చేరడంతో అధికారులు ముందస్తుగా పూర్తిగా తొలగించారు. ఆ భవనం నుంచి కళాశాలకు విద్యుత్తు సరఫరా ఉండేది. భవనం తొలగింపుతో సరఫరా నిలిచిపోయి కళాశాలలో కంప్యూటర్ల వినియోగం లేకుండా పోయింది. గదుల్లో చీకటిగా మారింది. దీంతో పాటు తాగునీటికి కష్టాలు తప్పడం లేదు. శుద్ధ జలం యంత్రంతో పాటు పైపులను తొలగించి ఓ మూలన ఉంచారు. నీటి సౌకర్యం లేక మూత్రశాలలు వినియోగించుకోవడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించి భవన నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు.

# ఉద్యోగ భద్రత ఏదీ..!

సూర్యాపేట : ‘ వేతనం సరైన సమయానికి రాదు.. ఇంటి అవసరాలకు, పిల్లల ఫీజులకు ఇబ్బందులు తప్పవు.. అసలే పంచాయ తీల్లో సర్పంచుల పాలన ముగిసింది.. దీనికి తోడు నిధులు విడుదల కాకపోవడంతో చేతి నుంచి ఖర్చు చేయాల్సి వస్తోంది.. వీటన్నింటినీ భరిస్తున్నా.. ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించక పోవడంతో పీఎఫ్, ఉద్యోగోన్నతులు నష్టపోవాల్సి వస్తోంది..

ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు సైతం దక్కడం లేదు..’.. అని పలువురు పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.’



పల్లె రూపురేఖలు మార్చాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో పంచాయతీకో కార్యదర్శి చొప్పున ఉద్యోగ నియామకాలు చేపట్టారు. వారికి రెండేళ్ల పాటు ప్రొబేషన్, ఆ తరువాత క్రమబద్ధీకరించేలా ఉత్తర్వులు జారీ చేస్తూ వారిని రాత పరీక్ష ద్వారా ఎంపిక చేశారు. రెండేళ్లు పూర్తయిన అనంతరం గత ప్రభుత్వంలో వారిని క్రమబద్ధీకరిం చకపోవడంతో ధర్నా, రాస్తారోకోలు చేశారు. తరువాత వేతనం పెంచుతూ ప్రొబేషన్ కాలాన్ని మరో రెండేళ్ల పాటు పొడిగించారు. చివరికి నాలుగేళ్ల తరువాత క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టారు. కాగా ఎన్నికల కారణంగా జిల్లాలో నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న దాదాపు 25 మంది క్రమబద్ధీకరణకు నోచుకోలేదు. ఈ ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి కాగా కేవలం సూర్యాపేట జిల్లాలోనే అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో గత ప్రభుత్వంలో 475 పంచాయతీలకు గాను 357 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నియామకం చేపట్టారు. 2018 నుంచి విడతల వారీగా వీరిని విధుల్లోకి తీసుకున్నారు. గత ప్రభుత్వంలో నాలుగేళ్లు పూర్తి చేసుకున్న 280 మందిని డీఎస్పీ, డీఎఫ్‌వో వంటి అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి క్రమబద్ధీకరించారు. ఆ తరువాత వరుస ఎన్నికల నేపథ్యంలో దృష్టి సారించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మరో 30 మందిని చేశారు. మిగతా వారు క్రమబద్ధీకరణకు అర్హత సాధించి ఏడాదిన్నర కావస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరీక్షిస్తున్నారు. కాగా వీరి క్రమబద్ధీకరణకు ఓ ఉన్నతస్థాయి అధికారి పెద్ద మొత్తంలో ముడుపులు ఆశిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**నివేదిక పంపించాం**

యాదయ్య, డీపీవో, సూర్యాపేట

నాలుగేళ్లు పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల వివరాలను నివేదించాం. అర్హులైన 25 మందిని త్వరలో క్రమబద్ధీక రించేందుకు చర్యలు చేపడుతున్నాం. జూనియర్ కార్యదర్శులు ఆందోళన చెందవద్దు

# సరిహద్దు మార్గం.. రాకపోకలకు నరకం

కోరుట్ల: రెండు జిల్లాలను కలిపే ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో రాకపోకలకు అవస్థలు తీవ్రమయ్యాయి. విస్తరణ చేపట్టినా పనులు అర్ధంతరంగా వదిలేయడంతో వాహనదారులకు నరకప్రాయంగా మారింది. కథలాపూర్ మండలం భూషణ్‌రావుపేట ప్రభుత్వ పాఠశాల నుంచి 100 మీటర్ల వరకు జిల్లా ఆర్‌అండ్‌బీ పరిధిలోకి వస్తుంది. అక్కడి నుంచి నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ గ్రామం సరిహద్దు ప్రారంభమై 4 కిలోమీటర్ల మేర ఆ జిల్లా ఆర్‌అండ్‌బీ పరిధిలోకి వెళ్తుంది. రెండు జిల్లాలను కలిపే రహదారిని రెండు వరుసలుగా విస్తరించేందుకు మూడేళ్ల కిందట పనులు చేపట్టారు. కోనాపూర్ నుంచి భూషణ్‌రావుపేట శివారులోని సరిహద్దు వరకు సుమారు 4 కిలోమీటర్ల దూరం వరకు రెండు వరుసల రహదారి



పనులను వెంటనే ప్రారంభించారు. పాత రహదారికి ఇరువైపులా మట్టిని తవ్వి కంకర, రాతి మిశ్రమాన్ని పోసి రెండు వరుసలుగా విస్తరించారు. దానిపై తారు పోసి చదును చేయకుండా వదిలేశారు. దీంతో పాటు భూషణరావుపేట శివారులోని రహదారిపై తారు తవ్వి మట్టి పోసి రోడ్డు ఎత్తు పెంచారు. ఇంతలో 2023 చివరలో శాసనసభ ఎన్నికలు రావడంతో కొత్త ప్రభుత్వం వచ్చింది. గుత్తేదారు రహదారి విస్తరణ పనులను అర్ధంతరంగా వదిలేయడంతో భూషణ్‌రావుపేట శివారులోని రహదారి పూర్తిగా గుంతలతో బురదమయంగా మారింది. ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అధికారులు చొరవచూపి రహదారి విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయించాలని కోరుతున్నారు.

# చెరువుకు చేప.. రైతుకు రొక్కం

భానుపురి : చేపల పెంపకాన్ని రైతులు, మత్స్యకారులు కలిసి అభివృద్ధి చేసుకుంటున్నారు. స్థానికంగా ఉన్న నీటి వనరులను వినియోగించుకుంటూ గ్రామాల్లో యువతకు ఉపాధి కల్పిస్తున్నారు. జులై 10న జాతీయ చేపల రైతు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఎన్ఎఫ్‌డీబీ(జాతీయ చేపల పెంపకం మండలి) సహకారంతో స్థిరమైన నిల్వలు, ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థలను నిర్ధారించడానికి మత్స్య వనరులను నిర్వహించే విధానంలో మార్పులపై దృష్టిసారించడం కార్యక్రమ లక్ష్యం. ప్రొఫెసర్ డాక్టర్ హీరాలాల్, అతని సహోద్యోగి డాక్టర్ అలీకున్హి చేసిన కృషికి గుర్తుగా దీనిని జరుపుకుంటారు.

**కార్యకలాపాలివే**

చేపల పెంపకం, మార్కెటింగ్‌పై జిల్లాలోని మత్స్యకారులకు అధికారులు శిక్షణ కార్యక్రమాలు, అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నారు.

కొత్త మత్స్య సంఘాలు, మత్స్య మహిళా సంఘాల ఏర్పాటుకు కృషి.

ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం.పట్టణాలు, గ్రామాల్లో చేపల మార్కెట్లు స్థాపించేలా అవగాహన.మత్స్యకారుల సంక్షేమం కోసం జిల్లాలో కేంద్ర, రాష్ట్ర పథకాలను అమలు చేయడం.

మత్స్యకారులకు/మత్స్య రైతులకు సాంకేతిక సాయం అందించడం.

ప్రమాద బీమా సౌకర్యం కల్పించడం.

విస్తరిస్తున్న మత్స్య సహకార సంఘాలు

ఉమ్మడి నల్గొండ జిల్లాలో చేపల రైతులు 344 మంది ఉన్నారు.



మత్స్యసహకార సంఘాలు 601 ఉండగా 54,250 మంది సభ్యులు ఉన్నారు. జిల్లాలోని జలాశయాల్లో చేపల వేట కొనసాగిస్తున్నారు. వీరికి ప్రభుత్వ పరంగా బీమా పథకాలు ఉన్నాయి. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో చెరువులు, మత్స్యకారులకు ఉపాధి, సొంత భూమిలో చేపల పెంపకానికి సహాయ సహకారాలు అందుతున్నాయి. మత్స్యకారులు ప్రమాదానికి గురైతే బీమా సదుపాయం వర్తిస్తుంది. శాశ్వత వైకల్యానికి రూ.5 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.2.5 లక్షలు అందజేస్తున్నారు.

**ఉత్పత్తి పెంపే లక్ష్యం**

నాగులు నాయక్, జిల్లా మత్స్యశాఖ అధికారి, సూర్యాపేట

జిల్లాలో చేపల ఉత్పత్తి పెంచడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నాం. జిల్లాలో గతేడాది కంటే ఈసారి రెండింతలు చేపలు పెంచేలా కార్యాచరణ చేపడుతున్నాం. ప్రభుత్వపరంగా వచ్చే ఫలాలను మత్స్యకారులకు అందిస్తున్నాం. చేపల పెంపకం చేపట్టేందుకు రైతులు ముందుకురావాలి. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద రైతులు తమ కమతాల్లో చేపల చెరువులు ఏర్పాటు చేసుకోవచ్చు.

# పొలం చెంత.. చినుకు చింత

జగిత్యాల : ఉమ్మడి జిల్లాలో చినుకు జాడ లేక రైతన్నలు నింగికేసి దిగాలుగా చూస్తున్నారు.. వేసిన పంటకు నీరందక.. నారు మడులు బీటలు వారి ఆవేదనలో మునిగిపోయారు.. వర్షాకాలం ప్రారంభమై రెండో నెల ముగిసే తరుణం సమీపిస్తున్నా భారీ వర్షాలు లేక ఉసూరుమంటున్నారు..

**లోటు ఇలా..**

మొత్తం 63 మండలాలకుగానూ 11 మండలాల్లో సాధారణ లోటు కనిపిస్తుండగా మిగతా 52 మండలాల్లో తీవ్రమైన లోటు వర్షపాతం ఉంది. జగిత్యాల, రాయికల్, గన్నేరువరం, తిమ్మాపూర్, చిగురుమామిడి, సైదాపూర్, శంకరపట్నం, హుజూరాబాద్, ముస్తాబాద్, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో ఫరవాలేదనే పరిస్థితి ఉంది. ఇక అత్యధికంగా ఓదెల మండలంలో 65 శాతం లోటు వర్షపాతం నమోదవగా రామగుండం (61 శాతం), ఎలిగేడు (60), సుల్తానాబాద్ (60), కరీంనగర్ గ్రామీణం (59), మంథని (57), రామగిరి (57), గంగాధర (55), ధర్మారం (55), జూలపల్లి (55), రుద్రంగి (55), పెద్దపల్లి (54), వీణవంకలో (54), గొల్లపల్లి (51), చొప్పదండి (51), కరీంనగర్ (50), అంతర్గాం (50), కమాన్‌పూర్ మండలంలో 50శాతం లోటు నమోదైంది.

**పంటల పరిస్థితి..!**

ఈ సీజన్‌లో 12,47,811 ఎకరాల సాధారణ విస్తీర్ణానికి గానూ ఇప్పటి వరకు 3,47,263 ఎకరాల్లో మాత్రం వరి సహా అన్ని పంటలు వేశారు. మొత్తంగా 27.82 శాతం పంటలు వేశారు.



జులై రెండోపక్షం వచ్చిందంటే వాతావరణం పూర్తిగా చల్లబడాలి. కానీ ప్రస్తుతం పగలు ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల వరకు, రాత్రి ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల సెల్సియస్ వరకు ఉంటూ ఉక్కపోత ఉంటోంది.

వీచే గాలులు, గాలిలో తేమశాతం తగ్గి పొడి వాతావరణం నెలకొనడం, రుతుపవనాల మందగమనం, ఉపరితల ఆవర్తనాలు ఏర్పడకపోవటం, ద్రోణిప్రభావాలు తగ్గి పంటలకు కష్టమవుతోంది.

ఈ వాతావరణం వల్ల నాలుగు జిల్లాల్లో విత్తుకున్న పత్తిలో రసం పీల్చు పురుగులు, మక్కలో కత్తెరపురుగు, వరిలో మొగిపురుగు తదితరాలు కొన్ని చోట్ల ఆశిస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.

పత్తి, సోయా చిక్కుడు పెరుగుదలకు కిలో 19:19:19ను నీటిలో కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేస్తే మంచిది. వరి నారుమడిలో మొగిపురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు చల్లాలి.

# నది.. గతి తప్పితే ముప్పే..!

కొత్తగూడెం : నదులు ప్రకృతి జీవనాడులు.. నాగరికతలను పోషించే పుష్కరిణులు. అవి నీటి ప్రవాహాలు మాత్రమే కాదు.. సంస్కృతి, జీవనోపాధికి ఆధారం. అయినా ఒక్కసారి గతి తప్పిన నది గ్రామాలను ముంచెత్తుతుంది. పచ్చని పంటలను నాశనం చేస్తుంది. జీవనాధారాలను నీటిలోకి నెట్టేస్తుంది. నది దిశ మార్పులతో పర్యావరణం, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇందుకు మానవ తప్పిదాలు, ప్రకృతి విపత్తులు కారణమవుతున్నాయి. భద్రాద్రి జిల్లాలోని నదుల ప్రవాహం గతి తప్పటం వల్ల సంభవించిన పరిణామాలపై ప్రత్యేక కథనం.పినపాక మండలం ఏడూళ్లబయ్యారంలో పెద్దవాగు సృష్టిస్తున్న విలయమిది. 30ఏళ్ల క్రితం నదికి 100 మీటర్ల దూరంలో గ్రామస్థులు పదుల సంఖ్యలో ఇళ్లు నిర్మించుకున్నారు. కాలక్రమేణా నది తన దిశను మార్చుకోవటంతో తీరం కోతకు గురవుతోంది. ఐదేళ్లలో అది తీవ్రరూపం దాల్చి ఇళ్ల వద్దకు చేరింది. రెండేళ్లలో ఒక మసీదు, పదుల సంఖ్యలో మరుగుదొడ్లు నీటిమట్టమయ్యాయి. ప్రస్తుతం 14 ఇళ్లకు ప్రమాదం పొంచి ఉంది. ఏటా వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా, తీవ్ర వరదల కారణంగా నది గతి తప్పుతోందని స్థానికులు చెబుతున్నారు.

ములకలపల్లి మండలం గుండా ప్రవహించే పాములేరు వాగు ప్రవాహం గతి తప్పటంతో తాళ్లపాయి శివారులోని ఆర్అండ్‌బీ రహదారి కోతకు గురవుతోందిలా. రోడ్డు మమర్మతులకు ఇప్పటికే అధికారులు రూ.40లక్షలు వెచ్చించినట్లు తెలుస్తోంది. అయినా ప్రమాదకంగానే దర్శనమిస్తోంది. గతంలో నిర్వహించిన ఇసుక ర్యాంపుల కారణంగా తాళ్లపాయితో పాటు రాజుపేట, తిమ్మంపేట సమీపంలో వాగు తన సహజ ప్రవాహానికి విరుద్ధంగా దిశను మార్చుకోవటంతో పంట పొలాలు కోతకు గురయ్యాయని, రూ.9కోట్లతో



నిర్మించిన తిమ్మంపేట ఎత్తిపోతల పథకానికి నీరందటం లేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**పరిష్కార మార్గాలివి..**

నది పరీవాహక ప్రాంతాల్లో అక్రమ కట్టడాలను నియంత్రించటానికి ప్రభుత్వం, స్థానిక సమాజాలు కృషి చేయాలి.

నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలపై కఠినంగా వ్యవహరించాలి. చట్టాలను పక్కాగా అమలుచేయాలి.

నది తీరాల వెంట పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకం చేపట్టాలి.

తీరప్రాంతాల్లో అక్రమ కట్టడాలు నదుల సహజ ప్రవాహాలకు అడ్డంకిగా మారుతున్నాయి. ఆకస్మికంగా సంభవించే భారీ వర్షాల వల్ల నదుల సామర్థ్యానికి మించి నీరు రావటంతో నది తీరాలు కోతకు గురవుతున్నాయి. ఇసుక అక్రమ తవ్వకాల వల్ల భూగర్భజలాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. నదుల లోతు ఎక్కువై వరదల ఉద్ధృతి పెరుగుతోంది.మోతీలాల్, డీఈ, నీటిపారుదలశాఖ, ములకలపల్లి

# సౌర'విద్యుత్తు'దీపం.. వెలిగితే 'ఆదా'యం



చిగురుమామిడి: ఒకప్పుడు గ్రామంలో వెలుగులు నింపిన సౌర విద్యుత్తు వీధిదీపాలు ప్రస్తుతం నిర్వహణ లేమితో

మూలకుపడ్డాయి. చిగురుమామిడి మండలం చినముల్కనూర్ గ్రామాన్ని భారాస అధినేత కేసీఆర్ పదేళ్ల కిందట దత్తత తీసుకున్నారు. అన్ని రంగాల్లో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. 'గ్రామ జ్యోతి' అనే కార్యక్రమంతో.. ఊరుకు అవసరమైన వసతులు పేదలకు ఇళ్లు, సీసీ రహదారులు, సౌర విద్యుద్దీపాలనూ ఏర్పాటు చేయించారు.

**ఎన్టీపీసీ సంస్థ సహకారంతో...**

విద్యుత్తు కొరత, లోవోల్టేజీతో విద్యుత్తు పంపు సెట్లు సక్రమంగా నడవడంలేదని, రాత్రుళ్లు వ్యవసాయ బావుల వద్దకు వెళితే చీకటితో ఇబ్బందులు పడుతున్నామని గ్రామ రైతులు అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే ఎన్టీపీసీ సంస్థ వారితో మాట్లాడి 2018-19 సంవత్సరంలో సుమారు రూ.5 కోట్ల వ్యయంతో గ్రామంలో 210 సౌర విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయించారు. ప్రతి స్తంభానికి బ్యాటరీతోపాటు బాక్స్, పైన సోలార్ ప్లేటును అమర్చారు. పగలు సూర్యరశ్మితో సోలార్ ప్లేట్లు ఛార్జ్ అయి.. రాత్రుళ్లు దీపాలు వెలిగేవి.

**బ్యాటరీల చోరీ.. రికవరీ..**

2019లో కొందరు దుండగులు 8 సౌరవిద్యుద్దీపాల బ్యాటరీలను అపహరించారు. గ్రామస్థులు వారిని పట్టుకొని బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. తిరిగి అమర్చడంతో కొన్ని రోజుల వరకు సక్రమంగా నడిచాయి. అయితే ఏడాది తిరగకముందే మళ్లీ పెద్ద ఎత్తును బ్యాటరీలను దుండగులు దొంగిలించారు. గ్రామ పంచాయతీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు వాటిని రికవరీ చేసి అప్పగించారు. ఛార్జింగ్, నిర్వహణ లేకపోవడంతో సోలార్ ప్లేట్లు, బ్యాటరీలు తుప్పుపట్టి మూలకు చేరాయి.

**నెలకు రూ.50 వేల కరెంటు బిల్లు**

గ్రామంలో ప్రస్తుతం విద్యుత్తు వీధి దీపాలను వినియోగించడంతో గ్రామ పంచాయతీకి ప్రతి నెల రూ.50 వేల బిల్లు వస్తోంది. సౌర విద్యుద్దీపాలను తిరిగి మరమ్మతు చేసి వినియోగిస్తే ఈ బిల్లు భారం తప్పుతుంది. ఆ ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి ఖర్చు చేయొచ్చు.

**గ్రామసభలో నిర్ణయం తీసుకుంటాం**

గ్రామంలో సోలార్ వీధి దీపాలను మరమ్మతు చేయడం నిధులతో కూడుకున్న పని. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత సర్పంచి, వార్డు సభ్యులతో గ్రామ సభ నిర్వహించి నిర్ణయం తీసుకుంటాం.
స్వప్న కార్యదర్శి

# అటు సంస్కరణలు.. ఇటు వసూళ్లు




జగిత్యాల : 'లంచం ఇవ్వకండి.. మాకు సమాచారం ఇవ్వండి' అంటూ రెండేళ్ల కిందట విద్యుత్తు కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నంబరును ప్రదర్శించారు. ఆ నంబరుకు జిల్లాలో చాలా ఫిర్యాదులు వచ్చాయి. కొద్ది రోజులు అధికారులు బాగానే పని చేయగా కొంతకాలంగా పరిస్థితి మొదటికొచ్చింది. కొందరు చేతులు తడపనిదే పని చేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**అంచనాలు మారినా..**

మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన ఎనుగందుల గంగాధర్ ఇంటి నిర్మాణానికి కొనుగోలు చేసిన స్థలంలో ఉన్న విద్యుత్తు స్తంభం తొలగింపు కోసం 8 నెలల కిందట దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు రూ.72 వేల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించారు. దీంతో వినియోగదారు సహ చట్టం కింద దరఖాస్తు చేశారు. ఆ తర్వాత విద్యుత్తు అధికారులు మరోసారి అంచనా వేసి వ్యయం రూ.30 వేలుగా చూపించినా ఇప్పటివరకు పనులు చేపట్టలేదు. ఎస్ఈకి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది.మల్యాలకు చెందిన ప్రైవేటు పాఠశాల యజమాని నూకపల్లి శివారులోని తన భూమిలో విద్యుత్తు లైన్ ఏర్పాటుకు ఆ శాఖ ఉద్యోగితో ఒప్పందం కుదుర్చుకున్నారు. రూ.60 వేలు ఖర్చవుతుందని చెప్పడంతో రూ.30 వేలు ఇచ్చారు. ఆరు నెలలైనా పనులు చేయకుండా, డబ్బులు తిరిగివ్వకుండా తాత్సారం చేస్తుండటంపై 'అమ్యామ్యాల పర్వం.. చాటుమాటు ఒప్పందం' ప్రచురితమైంది. దీంతో ఉద్యోగి డబ్బులు వాపసు ఇచ్చి తాజాగా లైన్ నిర్మాణానికి రూ.1.02 లక్షలు ఖర్చవుతుందంటూ కొత్తగా అంచనా వేసి అందించారు.

**బదిలీ అయినా అదే తీరు**

మెట్‌పల్లి డివిజన్‌లో పని చేసే ఓ విద్యుత్తు ఉద్యోగి గతంలో పని చేసిన చోట ఓ వినియోగదారుకు మంజూరైన విద్యుత్తు మీటరు బిగించేందుకు డబ్బులు డిమాండ్ చేశాడు. ఇవ్వకపోవడంతో మంజూరైన మీటరును రద్దు చేశాడు. బాధితుడు ఉన్నతాధికారికి ఫిర్యాదు చేయడంతో ఉద్యోగిని మరో మండలానికి బదిలీ చేశారు. అక్కడ కూడా వినియోగదారులను డబ్బుల కోసం వేధిస్తున్నాడని ఉన్నతాధికారులకు ఫిర్యాదులందాయి. అతడిపై విచారణ కొనసాగుతోంది.

మెట్‌పల్లి సర్కిల్‌లోని ఓ మండలంలో పాత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ఒక్కో మీటరుకు రూ.500 వరకు వినియోగదారు నుంచి వసూలు చేస్తున్నారు. కొందరు డబ్బులు ఇవ్వకపోవడంతో మీటర్లు బిగించలేదని ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై ఏఈ దృష్టికి తీసుకెళ్లి రెండు, మూడు నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు.

**మారకపోతే వేటు తప్పదు**

ఈ విషయమై ఎస్ఈ సుదర్శన్‌ను వివరణ కోరగా ఉద్యోగుల తీరు మారకపోతే వేటు తప్పదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.విద్యుత్తు వినియోగదారుల ఫోరం ఛైర్మన్ నంబరు: 83339 23841

# నిర్లక్ష్యం.. వైద్యుల ఇష్టారాజ్యం



గోదావరిఖని : పట్టణంలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుండగా.. ఆసుపత్రి వర్గాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలున్నాయి. ఆసుపత్రి నిర్వహణలోని లోటు పాట్లను జిల్లా పాలనాధికారికి ఎవరు సమాచారం చేరవేస్తున్నారంటూ ఆరా తీస్తున్న ఆసుపత్రి వర్గాలు.. ఒక్కొక్కరిగా ఒప్పంద సిబ్బందిని తొలగిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో తొలగించిన ఒప్పంద కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించినా విధుల్లోకి తీసుకోకుండా జాప్యం చేస్తున్నారు. వివిధ కారణాలతో ఇతర ఒప్పంద కార్మికులను తొలగిస్తుండగా.. ఇటీవల మరొకరిని విధులకు దూరంగా ఉంచారు.

**ప్రత్యేక చొరవ తీసుకుంటూ..**

ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఫలానా సమస్య ఉందనగానే వెంటనే జిల్లా పాలనాధికారి స్పందిస్తున్నారు. దీనిలో భాగంగా అవుట్ పేషెంటు నమోదు కోసం ప్రత్యేకంగా షెడ్డు నిర్మాణం, రోగుల అటెండెంట్ల కోసం ఆసుపత్రి భవనం మధ్యలో షెడ్డు వేసి బల్లలు ఏర్పాటు చేయించారు. మందులు సరఫరా చేసే గుత్తేదారుకు పెండింగ్ బిల్లుల చెల్లింపుతోపాటు ఇతర అవసరాలకు నిధులు కేటాయించారు. రెండు నెలలుగా మరమ్మతులకు నోచుకోని లిఫ్టు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.

**కలెక్టర్ ఆదేశాలపై..**

సిబ్బంది తప్పనిసరిగా ప్రతి రోజు ఆసుపత్రిలో అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందించాలనే కలెక్టర్ ఆదేశాలను అధికారులు, సిబ్బంది ఇబ్బందిగా భావిస్తున్నారు. ఆసుపత్రి నిర్వహణను మెరుగుపరచాలనే లక్ష్యంతో తరుచూ క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేస్తున్న జిల్లా పాలనాధికారి అక్రమాలకు పాల్పడుతున్న ఇద్దరు ఒప్పంద ఉద్యోగులను ఇటీవల విధుల్లోంచి తొలగించారు. దీంతో రోగులు, బాలింతల వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న ఒప్పంద పారిశుధ్య కార్మికుల చర్యలకు అడ్డుకట్ట వేసినట్లయింది.

# ఉపాధి తోడుగా.. కష్టాలు తీరగా

సారంగాపూర్: జిల్లాలో ఉపాధిహామీ ద్వారా పశువుల పాక, కోళ్ల షెడ్లు, గొర్రెలపాకలు, వర్మీ కంపోస్టు, నీటి నిల్వ గుంతలు, భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు, పొలం బాటలు తదితర అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. జిల్లాలో పశువుల పాకలు 769, కోళ్ల షెడ్లు 386 ఏర్పాటుకు లక్ష్యం నిర్దేశించారు. వర్మీ కంపోస్టు నిర్మాణాలు 193, అజోలా ఎరువు తయారీ గుంతలు 193, ఫారంపాండ్‌లు 386 లక్ష్యాన్ని నిర్దేశించగా పనులు కొనసాగుతున్నాయి.పాకల నిర్మాణాలపై అవగాహన

జిల్లాలో వివిధ రకాల పశువులు, గొర్రెలు, కోళ్ల పాకల నిర్మాణాలపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. పశువుల పాకకు రూ.85,000 చెల్లిస్తుండగా 18ఐ16 ఫీట్ల పొడవు, వెడల్పుతో నిర్మించుకోవాల్సి ఉంటుంది. గొర్రెల పాకకు రూ.లక్ష చెల్లిస్తుండగా 21ఐ16తో, కోళ్ల షెడ్డుకు రూ.3 లక్షలుకాగా 50ఐ16 పొడవు, వెడల్పుతో నిర్మించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం పశువుల పాకలు 769 లక్ష్యంకాగా 726 మంజూరు చేయగా 43 నిర్మాణాలు సాగుతున్నాయి. కోళ్ల షెడ్ల నిర్మాణాల కోసం 386 లక్ష్యాన్ని నిర్దేశించగా 363 మంజూరు చేయగా 19 నిర్మాణాలు, గొర్రెల షెడ్లు 91 మంజూరుకాగా 68 నిర్మాణాలు కొనసాగుతున్నాయి. 193 మంది రైతులకు వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ గుంతలు నిర్మించాలని భావించగా 167 నిర్మాణాలు మంజూరు చేశారు. ఒక్కో నిర్మాణానికి రూ.12,500, అజోలా తయారు చేసే గుంత నిర్మాణానికి రూ.6 వేలు చెల్లించనున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఆయా నిర్మాణాలు చేపట్టేలా ఉపాధి సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

**భూగర్భ జలాల పెంపుపై దృష్టి**

భూగర్భ జలాల పెంపునకు ఉపాధిహామీ పనుల ద్వారా పలు



నిర్మాణాలు చేపడుతున్నారు. రూ.4.50 లక్షలతో పర్క్‌లేషన్ ట్యాంకు నిర్మాణాలను పూర్తిగా కూలీల ద్వారా ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 96 నిర్మాణాలు లక్ష్యంకాగా 88 నిర్మాణాలు మంజూరు చేయగా పనులు కొనసాగిస్తున్నారు. 1,922 ఇంకుడు గుంతల నిర్మాణాలు లక్ష్యంకాగా 410 ప్రగతిలో ఉన్నాయి. రైతుల పంట పొలాలకు వెళ్లే రహదారుల నిర్మాణాలు చేపడుతుండగా ప్రతీ మండలానికి 10 కిలోమీటర్ల చొప్పున నిర్మించాలని లక్ష్యాన్ని నిర్దేశించగా ప్రస్తుతం 764 కి.మీ. మేర రహదారులు పూర్తి చేశారు.

**కూలీలకు ఉపాధి..**

ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు అవసరమైన కోళ్లు, పశువులు, గొర్రెల షెడ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. భూగర్భ జలాల పెంపునకు చేపట్టిన పనులు కొనసాగిస్తుండగా దీని ద్వారా కూలీలకు ఉపాధి లభిస్తుంది. రైతుల పంట పొలాలకు రహదారుల నిర్మాణాలు చేపడుతున్నారు.శివప్రసాద్, సాంకేతిక సహాయకుడు

# ఆహారశుద్ధి.. అతివల ఆర్థిక వృద్ధి

సంగారెడ్డి టౌన్: పొదుపులు.. బ్యాంకు రుణాలు.. వాయిదాల చెల్లింపులు.. మహిళా సంఘాలు అంటే గుర్తుకు వచ్చేవి ఇవే. ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కాలన్న లక్ష్యంతో మహిళలు పొదుపు సంఘాల్లో చేరుతున్నా ఆశించిన స్థాయిలో స్థితిగతుల మారడం లేదు. బ్యాంకు రుణాలు అంతంతమాత్రంగా ఉండటంతో స్వయం ఉపాధికి బాటలు వేసుకోలేకపోతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటు దిశగా వారిని అడుగులు వేయించాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) నిర్ణయించింది. ఇందుకోసం రాయితీ రుణాలు మంజూరు చేస్తున్నారు.

**లక్ష్యం 100 యూనిట్లు**

జిల్లాలో మిరప, పసుపు, పప్పు మిల్లులు, పాలపదార్థాల ఉత్పత్తి, చిరుధాన్యాలు, నూనె, చిన్న రైస్‌మిల్లులు, పాపడాలు, పచ్చళ్లు తదితర యూనిట్లతో మహిళలు ఇప్పటికే ఉపాధి పొందుతున్నారు. పీఎం ఫార్ములేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రెన్యూర్ స్కీమ్(పీఎంఎఫ్ఎంఈ) పథకం కింద రాయితీపై రుణాలు మంజూరు చేస్తున్నారు. దీనివల్ల యూనిట్ల విస్తరణకు మార్గం సుగమం అవుతోంది. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం 100 యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. ఎంపికైన యూనిట్లకు 35 శాతం రాయితీపై రుణాలు మంజూరు చేయనున్నారు.

**నాణ్యమైన ఉత్పత్తుల కోసం..**

మహిళా సంఘాలకు చెందిన సభ్యుల్లో కొందరు ఇప్పటికే ఆహార సంబంధిత రంగంలో ఉపాధి పొందుతుండగా ఆహారశుద్ధి యూనిట్ల విస్తరణకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించనుంది. తద్వారా మరింత మంది మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించనున్నారు. నాణ్యతకు పెద్దపీట వేయాలని నిర్ణయించారు. యూనిట్ల విస్తరణకు అవసరమైన సాంకేతిక, ఆర్థికపరంగా సాయం అందించనున్నారు. శిక్షణ ఇవ్వడం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు మహిళా సంఘాల ద్వారా వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయి.

**సద్వినియోగంతో సత్ఫలితాలు**

జంగారెడ్డి, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి

ఆహారశుద్ధి యూనిట్లతో మహిళా సంఘాల సభ్యులకు ప్రయోజనం ఉంటుంది. యూనిట్ల విస్తరణతో మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుంటుంది. వినియోగదారులకు కల్తీలేని ఆహార ఉత్పత్తులు అందించినట్లు అవుతుంది. మహిళా సంఘాల సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎంపిక చేసిన మహిళా సంఘాల సభ్యులకు రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేయించడంతోపాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

జిల్లాలో గ్రామైక్య సంఘాలు: 695
మహిళా సంఘాలు: 18,213
ఆయా సంఘాల్లో సభ్యులు: 1.90లక్షల మంది

# డెంగీ పంజా

కరీంనగర్ : కరీంనగర్‌లోని లక్ష్మీనగర్‌కు చెందిన ఆరేళ్ల బాలుడు తీవ్ర జ్వరంతో బాధపడగా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. డెంగీ పాజిటివ్ రావడంతో వారం కిందట చికిత్స తీసుకున్నారు. మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన మహిళ జ్వరంతో బాధపడుతుండగా కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయగా డెంగీ పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఏటా వర్షాకాలంలో కాలానుగుణ వ్యాధులు ప్రబలడం సర్వసాధారణం. ప్రస్తుతం జిల్లాలో సాధారణ జ్వరాలతో పాటు డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇప్పటి వరకు ఎనిమిది మందికి నిర్ధారణ అయింది. వారిలో ఇద్దరు హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నలుగురు ప్రభుత్వ, ఇద్దరు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. జ్వరాల బారిన పడిన వారి సంఖ్య పెరుగుతుండటంతో జిలావ్యాప్తంగా ఆందోళన నెలకొంది.

**ఆయా ప్రాంతాల్లో ఇలా..**

మానకొండూర్ నియోజకవర్గ పరిధిలో అన్నారం, లక్ష్మీపూర్ గ్రామాల్లో ముగ్గురు డెంగీతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. అధికారులు



అల్ఫాసైఫర్ మెత్రిన్ అనే దోమల మందును మంగళవారం పిచికారీ చేయించారు. కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌లో ఒకరు, కరీంనగర్ లోని లక్ష్మీనగర్, సంతోష్‌నగర్, మెహర్‌నగర్, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో మలేరియా వైద్య విభాగం అధికారులు జ్వర పీడితులను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో సర్వే చేసి వైద్య శిబిరాలు నిర్వహించారు. పలు రకాల దోమల మందులను పిచికారీ చేయిస్తూ ఇళ్లు, పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్నారు. సర్వే నిర్వహించి సాధారణ జ్వర బాధితులకు మందులు అందజేస్తున్నట్లు మలేరియా విభాగం అధికారులు తెలిపారు.

**జాగ్రత్తగా ఉండాలి**

వర్షాకాలంలో నీరు నిల్వకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. లార్వాలు పెరగకుండా దోమలమందు పిచికారీ చేయిస్తున్నాం. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండకపోతే చర్యలు తీసుకుంటాం. డెంగీ పాజిటివ్ వస్తే కరీంనగర్ ప్రభుత్వాసుపత్రిలో వైద్యం అందిస్తాం. వసతి గృహాల్లోనూ వైద్య శిబిరాలు, జ్వర సర్వేలు చేస్తున్నాం. జ్వరాలు ఎక్కువైతే వెంటనే ఆశా కార్యకర్తలకు లేదా ఏఎన్ఎంలకు సమాచారం ఇవ్వాలి. నిర్లక్ష్యం వహించకుండా సమీప ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోవాలి. డాక్టర్ వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, కరీంనగర్

# నిర్లక్ష్యపు నీడలో వైకుంఠధామాలు

ధర్మపురి : జిల్లాలో పలు వైకుంఠధామాలు నిర్లక్ష్యపు నీడలో మగ్గుతున్నాయి. గోదావరి తీరంలోని పలు గ్రామాల్లో శ్మశాన వాటికలను ఉపాధిహామీ, ఇతర నిధులతో నిర్మించారు. అయితే గోదావరి ఉప్పొంగినప్పుడల్లా క్రమంగా ఇవి నీటిలో మునిగిపోవడం.. మరోవైపు స్థానిక పురపాలక, పంచాయతీ సిబ్బంది నిర్వహణ లేక శిథిలావస్థకు చేరాయి. ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ప్రజాధనం వృథా చేశారని పలువురు చర్చించుకుంటున్నారు. ధర్మపురి, బీర్‌పూర్, వెల్గటూర్, రాయికల్, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లో గోదావరి తీరానే నిర్మించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**వరదలతో నామరూపాల్లేకుండా..**

గోదావరి తీరంలోనే శ్మశాన వాటికలను నిర్మించడం ఇంజినీర్ల లోపభూయిష్టమైన విధానమేనని భావిస్తున్నారు. ఏటా వరదలతో నామరూపాల్లేకుండా పోతున్నాయి. కొంతదూరంలో నిర్మించాల్సి ఉండగా.. నిర్లక్ష్యంగా వ్యవహరించారని స్థానికులు విమర్శిస్తున్నారు. దమ్మన్నపేట, ఆరెపల్లి తదితర గ్రామాల్లో శ్మశాన వాటికలు వరదలకు అధ్వానస్థితికి చేరాయి. వీటిని మరమ్మతు చేయాలనే ఆలోచన అధికారులు చేయడంలేదు. రూ.కోటి వెచ్చించి ఆధునిక వసతులతో ధర్మపురి గోదావరి తీరంలో నిర్మించిన వైకుంఠధామం అస్తవ్యస్తంగా తయారైంది. కనీస సదుపాయాలు కరవయ్యాయి. ఆధునిక వసతులతో నిర్మించిన నాలుగు గదుల తలుపులను ఆకతాయిలు పగులగొట్టారు. బోరు వేయించినా మోటారు ఏర్పాటు చేయలేదు. ఎటువైపు చూసినా పిచ్చి మొక్కలు, ధ్వంసమైన తలుపులు కనిపిస్తున్నాయి. మందుబాబులకు అడ్డాగా మారగా.. ప్రహరీ దెబ్బతింది.

**అన్నిచోట్లా అరకొర వసతులే**

జిల్లాలోని మెట్‌పల్లి, కోరుట్ల ప్రాంతాల్లోని శ్మశాన వాటికలు అరకొర వసతులతో నెట్టుకొస్తున్నాయి. మెట్‌పల్లిలో ప్రహరీ, బోరు లేక ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్ నీటిపై ఆధార పడాల్సివస్తోంది. కోరుట్ల, గొల్లపల్లి, వెల్గటూర్ తదితర ప్రాంతాల్లోని వాటికి వసతులు కరవయ్యాయి. ధర్మపురి వైకుంఠధామంపై పురపాలక కమిషనర్ శ్రీనివాస్‌రావు దృష్టికి తీసుకువెళ్లగా.. త్వరలోనే పరిశుభ్రత పనులు చేపట్టి వినియోగించుకునేలా కృషి చేస్తామన్నారు.

# అంచుల్లో కోతలు.. నిలవని నీళ్లు

కోదాడ : భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా గత ప్రభుత్వం నదులపై చెక్ డ్యాం నిర్మాణాలు చేపట్టింది. ఈ నిర్మాణాలు నాణ్యతగా లేకపోవడంతో అంచులు కోతకు గురయ్యాయి. దీంతో చెక్ డ్యాం నిర్మించినా నీరు నిల్వ ఉండే పరిస్థితి లేదు. జిల్లాలో ప్రధానమైన మూసీ, పాలేరు నదులపై ఉన్న చెక్ డ్యాంల అంచులు కోతకు గురయ్యాయి. జిల్లా నుంచి ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉండటంతో అసంపూర్తి చెక్ డ్యాం నిర్మాణాల్లో కదలిక వచ్చే అవకాశం ఉంది. వినియోగంలోకి రాక..

2019-20 సంవత్సరంలో చెక్ డ్యాం నిర్మాణ పనులు ప్రారంభం కాగా, చాలా ప్రాంతాల్లో పూర్తి కాలేదు. అంతలోనే అంచులు కొట్టుకుపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటికి నిధులు కేటాయించకపోవడంతో మిగతా పనులు పూర్తి కాలేదు. పాలేరు వాగుపై అనంతగిరి మండలంలోని శాంతినగర్ సమీపంలో సుమారు రూ.3 కోట్లు, పాలారం గ్రామ సమీపంలో సుమారు రూ.2.80 కోట్లు, గొండ్రియాల సమీపంలో రూ.2.34 కోట్లు, కోదాడ రూరల్ పరిధిలోని రెడ్లకుంట పరిధిలో రూ.2.70 కోట్లతో, మోతె మండలంలో మరో రెండు చెక్‌డ్యాంలు నిర్మించారు. మూసీనదిపై హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని నేరేడుచర్ల మండలం ఎల్లారం, సోమారం గ్రామ పరిధిలో, పాలకవీడు మండలంలోని రాఘవాపురం, శూన్యపహాడ్, మూసిఒడ్డుసింగారం, మఠంపల్లి మండలంలోని చెన్నాయిపాలెం, గుర్రంపోడుతండా సమీపంలో నిర్మించిన చెక్ డ్యాంల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

# తడి.. పొడి.. ఆచరణలో తడబడి



జగిత్యాల : పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచడంతో పాటు వ్యర్థాల పునర్వినియోగానికి తడి పొడి చెత్త సేకరణ విధానం అమలు చేస్తున్నారు. కాగా జగిత్యాల పట్టణంలో తడి పొడి చెత్త సేకరణ పూర్తిగా నిర్వీర్యమైంది. సరిపడా సిబ్బంది, వాహనాలున్నా అవగాహన లోపం, బాధ్యతా రాహిత్యంతో అమలులో చతికిలపడింది.

**వనరులున్నా నిరుపయోగం**

48 వార్డుల్లో ఇంటింటా చెత్త సేకరణకు 68 వాహనాలున్నాయి. పారిశుద్ధ్య విభాగంలో 262 మంది సిబ్బంది పని చేస్తున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసే క్రమంలో కార్మికులకు శ్రమ లేకుండా వాహనాల్లోనే ప్రత్యేక అరలు ఏర్పాటు చేశారు. సేంద్రియ ఎరువు తయారీ కోసం 2020లో పట్టణ ప్రగతి నిధులతో నూకపల్లి డంపు యార్డులో ప్రత్యేక షెడ్డు నిర్మించారు. మొదట్లో 4 వార్డుల్లో తడి, పొడి చెత్త సేకరణ విధానాన్ని అమలు చేసిన అధికారులు ఆ తర్వాత చేతులెత్తేశారు.

**నాడు రాష్ట్రంలోనే ప్రథమం**

పురపాలిక పరిధిలో సేకరించిన తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయాల్సి ఉంది. దీన్ని స్థానికంగా మొక్కల పెంపకంతో పాటు అవసరమైన వారికి అందజేయాల్సి ఉంటుంది. 2012లో అధికారుల కృషితో తడి, పొడిలో జగిత్యాల బల్దియా రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించింది. ఆ తరువాత వచ్చిన అధికారుల్లో చిత్తశుద్ధి లేక ప్రక్రియ పడకేసింది. పట్టణంలో నిత్యం 10 మెట్రిక్ టన్నుల తడి చెత్త, 8 మెట్రిక్ టన్నుల పొడి చెత్త, 4 టన్నుల మురుగు వ్యర్థాలు పోగవుతున్నాయి.

**ఇవీ కారణాలు**

తడి, పొడి చెత్తను ఇంటి వద్దే వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు.

వాహనాలు తరచూ మరమ్మతుకు గురవుతుండటంతో సిబ్బంది ఒకే డబ్బాలో వేసుకొని వెళ్తున్నారు.

పొడి చెత్తను పట్టణ సమాఖ్య తీసుకొని నగదు చెల్లిస్తుండటంతో తడి చెత్తపై నిర్లక్ష్యం కనిపిస్తోంది.

తడి, పొడి చెత్త సేకరణకు ప్రత్యేకంగా కేటాయించిన పర్యావరణ ఇంజినీర్‌కు హరితహారం బాధ్యతలు అప్పగించడంతో నిర్లక్ష్యం కనిపిస్తోంది.

క్షేత్ర స్థాయిలో అధికారుల పరిశీలన లేకపోవడంతో నామమాత్రంగా మారింది.

పురపాలిక సమాచారం

వార్డులు: 48, పట్టణ జనాభా: 1.20 లక్షలు

నిత్యం సేకరించే చెత్త: 70 మెట్రిక్ టన్నులు

వినియోగించే వాహనాలు: 68

మొత్తం పారిశుద్ధ్య సిబ్బంది: 262

ప్రజలకు అవగాహన కల్పిస్తాంపట్టణంలో ఉత్పత్తి అవుతున్న చెత్త నుంచి 65 శాతాన్ని సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నాం. ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణకు ప్రాధాన్యమిస్తున్నాం. వేరు చేసి ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తాం. కొన్ని వార్డుల్లో సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం. శ్రీకాంత్, పర్యావరణ అధికారి

# పల్లెల స్వచ్ఛతకు పెద్దపీట



సారంగాపూర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా రద్దీ ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆలయాలు, ప్రార్థన మందిరాలు, పర్యాటక ప్రదేశాలు, బస్టాండ్లు, ఆస్పత్రులు, మార్కెట్‌లతోపాటు రద్దీ ప్రాంతాల్లో వీటిని నిర్మిస్తున్నారు. ప్రభుత్వ స్థలమున్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రదేశాల్లో పనులు ప్రారంభించారు. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా 70 శాతం నిధులు చెల్లిస్తుండగా.. 30 శాతం పంచాయతీ ఆర్థిక సంఘం నిధుల నుంచి వెచ్చించనున్నారు. పనుల పర్యవేక్షణ, కొలతలకు సంబంధించి ఉపాధి హామీ పథక అధికారులు చూడనున్నారు. ఇప్పటికే పలు మండలాల్లో పలు ప్రదేశాలను ఎంపిక చేసి పనులు ప్రారంభించారు. కొన్ని పూర్తవగా ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

**నిర్మించే మండలాలివే..**

జిల్లాలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో రూ.3 లక్షలతో మహిళలకు, పురుషులకు వేర్వేరుగా మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించనున్నారు. ఇందులో రూ.2.10 లక్షలు స్వచ్ఛ భారత్ మిషన్ కింద చెల్లిస్తుండగా, మిగతా రూ.90 వేలు ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లింపులు చేయనున్నారు. జిల్లాలోని సారంగాపూర్ మండలం అర్పపల్లి, పెంబట్ల.. గొల్లపల్లి మండలం తిర్మలాపూర్.. కొడిమ్యాల మండలం నాచుపల్లి.. పెగడపల్లి మండలంలో లింగాపూర్, పెగడపల్లి.. కథలాపూర్ మండలంలో తాండ్ర్యాల, పెగ్గెర్ల, గంభీర్‌పూర్.. రాయికల్ మండలంలో బోర్నపల్లి, కొత్తపేట.. వెల్గటూర్ మండలంలో కోటిలింగాల.. మల్యాల మండలంలో ముత్యంపేట.. కోరుట్ల మండలం అయిలాపూర్‌తో పాటు మల్లాపూర్, మేడిపల్లి, బీర్‌పూర్ మండల కేంద్రాల్లోని ఆలయ ప్రాంతాలు, రద్దీ ఉన్న ప్రాంతాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సులు నిర్మిస్తున్నారు.

**త్వరితగతిన పూర్తి చేసేలా ఆదేశాలు**

రద్దీ ఉన్న ప్రాంతాల్లో వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వారి అవసరాల మేరకు కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు చేపడుతున్నాం. ప్రస్తుతం ఎంపిక చేసిన పలు ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయి. డీఆర్డీఏ, స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో పనులు కొనసాగుతున్నాయి. వీటిని వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం. రఘువరన్, డీఆర్డీవో

# గుట్టలన్నీ గుల్ల



సిరిసిల్ల: జిల్లాలో పలుచోట్ల అక్రమ మైనింగ్‌తో గుట్టలు గుల్లబారుతున్నాయి. వాస్తవానికి మట్టితవ్వకాలకు అనుమతుల లేవు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు రెవెన్యూ, నీటిపారుదల శాఖ అనుమతులు ఇస్తున్నాయి. వీటిలోనూ అనుమతికి మించి, హద్దులు దాటి కొండల్ని కరిగిస్తున్నారు. రూ.కోట్ల విలువైన మట్టిని, రాళ్లను యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాదు.. జీవవైవిధ్యం దెబ్బతింటోంది. వేములవాడ, పెద్దూరు పరిసరాల్లో వేల ఏళ్ల చరిత్ర ఉన్న ఆది మానవుల అవాస ప్రాంతాలనూ ధ్వంసం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించగా మైనింగ్ దందాలో విస్మయకర వాస్తవాలు వెలుగు చూశాయి.

**ఇదీ పరిస్థితి**వేములవాడ అర్బన్ మండలం కొడుముంజ, అనుపురం, రుద్రవరం గ్రామ శివారులో రాజరాజేశ్వర జలాశయం వెనకాల నల్ల మట్టి, మొరం దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇల్లంతకుంట మండలం అనంతగిరి, సిరికొండ, బోయినపల్లి మండలం అదనపు టీఎంసీ కాల్వ మట్టి, సిరిసిల్ల సమీపంలో ఎద్దుగుట్ట, మైసమ్మగుట్టలు, ఎల్లారెడ్డిపేట వెంకటాపూర్, కోరుట్లపేట, గొల్లపల్లి, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట మండలాల్లోని అటవీ సమీప గ్రామాల్లో మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. సమాచారం వచ్చినప్పుడు మాత్రం రెవెన్యూ, పోలీసుల తనిఖీల్లో వాహనాలను పట్టుకుంటున్నారు. కేసు నమోదు చేయడం, దానికి రెవెన్యూ అధికారులు చలానాతో జరిమానా కట్టిస్తున్నారు. జిల్లాలో రెండు నెలల్లో రూ.3.89 లక్షల జరిమానాలు వసూలు కావడం గమనార్హం. అసలు తవ్వకాలు ఎక్కడ జరుగుతున్నాయి? వాటిపై నిఘా వ్యవస్థ లేకపోవడం అక్రమార్కులకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. రెవెన్యూ అధికారులు మామూలుగా తీసుకోవడం. మైనింగ్‌లో సిబ్బంది కొరతను సాకుగా చూపి అటుగా వెళ్లట్లేదు. ఇది అక్రమార్కులకు కలిసివస్తోంది. ఇలా తరలిస్తున్న మట్టిని రియల్ వెంచర్లకు వినియోగిస్తున్నారు. చాలా వరకు అటవీ సమీపంలోని గుట్టలను, ప్రభుత్వ భూములను చదునుచేసి పంట భూములుగా మార్చుతున్నారు. **జీరో వేబిల్లు ఏమైంది?**

మట్టి తవ్వకాలకు ప్రభుత్వం జీరో వేబిల్లు విధానం తీసుకొస్తే అక్రమార్కులకు కొంతవరకైనా అడ్డుకట్టపడుతుంది. రెండేళ్ల క్రితం మైనింగ్‌శాఖలో ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. మండలాల వారీగా రెవెన్యూశాఖ మట్టి క్వారీలకు గుర్తించాలి. వాటిలో తవ్వకాలకు నిరభ్యంతరాలు తెలపాలి. ఈ సాఫ్ట్‌వేర్ ప్రక్రియ ప్రాథమిక దశలోనే నిలిచిపోయింది. ప్రభుత్వ నిర్మాణాలకు పని అంచనాల్లో మట్టి వినియోగం మేరకు బిల్లులు చెల్లించే క్రమంలో సెస్ రూపంలో తీసుకుంటుంది. కానీ క్షేత్రస్థాయిలో ప్రభుత్వ అవసరాలకు మించి పక్కదారి పడుతోంది. రెవెన్యూ, గనులశాఖ అనుమతితో మట్టి క్వారీల నుంచి తవ్వుకునే అవకాశం ఉంది. దీనికి క్యూబిక్ మీటరుకు రూ.100 చెల్లించాల్సి ఉంటుంది.

# టెండర్ నిర్వహణ.. ఒప్పందం విస్మరణ

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పలు ప్రాంతాల్లో రూ.50 కోట్ల మేర పనులు చేసేందుకు సాధారణ నిధులతో టెండర్లు పిలిచారు. డివిజన్లలో నిలిచిపోయిన రోడ్లు, మురుగుకాలువలకు సంబంధించిన పనులు చేసుకోవడానికి గత పాలకవర్గ సభ్యులు తీర్మానం కూడా చేశారు. ఆ పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకొస్తుండగా.. ఒప్పందం చేసేందుకు కొందరు ఇంజినీరింగ్ అధికారులు మాత్రం జాప్యం చేస్తున్నారు.

**గుత్తేదారులు డీడీలు చెల్లించినా..**

అభివృద్ధి పనులు చేసేందుకు గుత్తేదారులు డీడీలు కూడా చెల్లించారు.



ఆ మొత్తం బల్దియా ఖజానాలో జమ అయినప్పటికీ ఒప్పందం చేసే ఇంజినీరింగ్ అధికారులు మాత్రం జాప్యం చేస్తున్నారు. అలా ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కాక గుత్తేదారులు అయోమయంలో పడుతున్నారు. కొన్ని చోట్ల పనులు కూడా ప్రారంభించగా ఒప్పందం చేసుకోకుండా ఎలా చేస్తారని బెదిరింపులకు గురి చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

**అధికారుల వద్దే దస్త్రాలు**

టెండర్ నిర్వహించి ఒప్పందం చేసుకోవాల్సిన దస్త్రాలు ఇంజినీరింగ్ అధికారుల వద్దే ఉన్నాయి. ఓ వైపు రహదారులు మురుగుకాలువల పనులు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, కొందరు ఇంజినీర్లు మాత్రం మోకాలడ్డు పెట్టడం వివాదాస్పదంగా మారుతోంది. పనులు చేయకుండా ఆపడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న మాజీ పాలకవర్గ సభ్యులు మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని చెబుతున్నారు.

**కమిషనర్ ఆదేశాలతో..**

ప్రాధాన్యం ప్రకారం పనులు చేయాలని కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. సాధారణ నిధులతో గతంలో చేపట్టిన పనులకే రూ.కోట్లు నిధులు చెల్లించాల్సి ఉంది. సంజయ్‌కుమార్, ఈఈ, నగరపాలిక

# సంపుతున్నయ్ జాగ్రత్త

సిరిసిల్ల : కుళాయి నీటిని ఒడిసిపట్టేందుకు ఇళ్ల ఆవరణలో సంపులు నిర్మిస్తుంటారు. ఈ మధ్య ప్రతి ఇంటికి ఇవి తప్పనిసరిగా మారాయి. తొట్టీల నిర్వహణ సరిగ్గా లేకపోవడం, నీటితో ఆడుకునేందుకు ఇష్టపడే చిన్నారుల పాలిట మృత్యువుగా మారుతున్నాయి. ఎద్దడిలో నీటి నిల్వకు ఏర్పాటు చేసుకున్న తొట్లు ప్రాణాలను హరిస్తున్నాయి. భవన నిర్మాణ ప్రదేశాల్లో నీటితొట్టీలు, సెప్టిక్ ట్యాంకులపై పైకప్పు వేసేలా సంబంధిత పంచాయతీలు, మున్సిపాలిటీల్లో అధికారులు పర్యవేక్షణ చేయాలని.. నిర్లక్ష్యం చేసేవారిపై కఠినంగా వ్యవహరించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**తల్లిదండ్రులూ.. తస్మాత్ జాగ్రత్త**

బాల్యంలో చిన్నారులు నీటితో ఆడుకునేందుకు ఇష్ట పడుతుంటారు. అదే భావనతో తెరిచి ఉన్న నీటి సంపుల వద్దకు వెళ్లి ఆడుకునే క్రమంలో అందులో పడిపోతున్నారు. సంపుకు దూరంగా ఉండేలా చిన్నారులకు భయం చెప్పాలి. పెద్ద పిల్లలయితే అందులో పడితే జరిగే ప్రమాదంపై అవగాహన కల్పించాలి. జ్ఞానం రాని చిన్నారులపై నిత్యం తల్లితండ్రులు పర్యవేక్షణ ఉంచాలి.

పిల్లల ముందు సంపులను శుభ్రపరిచే పని పెట్టుకోకపోవడం మంచిది. అనుకరించి తర్వాత అందులో పడే ఆస్కారం ఉంటుంది.

సంపులను కడిగే క్రమంలో, నీటి నిల్వలు పరిశీలించిన పిదప తప్పనిసరిగా మూతను పెట్టాలి. ఆ విషయంలో ఏమరపాటు వద్దు. అవసరమైతే సంపులపై ఇనుప కంచె ఏర్పాటు చేయాలి. పైన ఏర్పాటు చేసిన సిమెంటు పలకలు చెడిపోతే వెంటనే మరమ్మతులు చేయించాలి. భవన నిర్మాణ పనులు చేపట్టే చోట సంపులు, సెప్టిక్ ట్యాంకులపై పైకప్పు వేయకుండా నిర్లక్ష్యం చేస్తుంటారు. పనిచేసే వారితోపాటు తోడుగా తెచ్చుకున్న పిల్లలు ఆడుకుంటూ పడిపోయే ప్రమాదం ఉంది. తల్లిదండ్రులు చిన్నారులు ఆడుకునే సమయంలో పొంచి ఉన్న



ప్రమాదాలను పసిగట్టాలి. బయట ఆడుకునేటప్పుడు ఎలాంటి పనులపై నిమగ్నం కాకుండా నిత్యం పర్యవేక్షించాలి.

మచ్చుకుకొన్ని ఘటనలు

వేములవాడ మండలం చింతల్ఠాణా ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన ఆరేళ్ల బాలుడు రుషి శనివారం స్నేహితులతో కలిసి బయటకు వెళ్లాడు. ఆడుకునే సమయంలో పొరపాటున నీటి సంపులో పడిపోయాడు. తనతో వచ్చిన పిల్లలు పరిగెత్తి ఇంట్లో వారిని తీసుకొచ్చేలోపే ప్రాణాలు కోల్పోయాడు. గతేడాది డిసెంబరు నెలలో గంభీరావుపేట మండలం నర్మాలలో 18 నెలల చిన్నారి ఇంటి బయట ఆడుకుంటోంది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిపోయి మృతి చెందింది. గత సంవత్సరం జులైలో ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ అనుబంధ గ్రామం గాజులపల్లిలో శ్యేహాన్ (3) ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. చేతిలో ఉన్న పలక మూత లేని నీటి తొట్టీలో పడింది. అది మృత్యు కుహరం అని తెలియక బాలుడు పలకను తీసే యత్నంలో అందులో పడ్డాడు. బాలుడి కోసం వెతికిన చూసిన తల్లికి సంపులో శవమై కనిపించాడు.

# నడ్డి విరుస్తున్న వడ్డీ



హైదరాబాద్: మెట్రో రైలు ప్రాజెక్ట్ మొదటిదశను వడ్డీలు నడ్డి విరుస్తున్నాయి. టికెట్లు, ప్రకటనలు, రియల్ ఎస్టేట్ ద్వారా ఆదాయం వస్తున్నా ముంత లాభం చిల్లు తీసిందన్న చందంగా పరిస్థితి మారింది. ప్రాజెక్ట్ నిర్మాణానికి చేసిన అప్పులకు చెల్లిస్తున్న వడ్డీతో నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తోందని మెట్రో వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు వడ్డీలకే రూ.4,500 కోట్లు చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఎల్అండ్‌టీ.. హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ నిర్మించి నిర్వహిస్తోంది. భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 వేల కోట్లు, సర్దుబాటు వ్యయ నిధి కింద కేంద్ర ప్రభుత్వం రూ.1,204 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం రూ.15,920.23 కోట్ల ఆస్తులు కలిగిన మెట్రో మొదటిదశలో రూ.8148.07 కోట్లు అప్పులున్నాయి.

ఆదాయమిలా... సంస్థకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1108.54 కోట్ల ఆదాయం వచ్చింది. టికెట్ల ద్వారా రూ.627.11 కోట్లు, ప్రకటనలు, రియల్ ఎస్టేట్ ద్వారా రూ.485.55 కోట్లు వచ్చింది. క్రితం ఏడాదితో పోలిస్తే 21 శాతం ఆదాయం తగ్గింది.

**జీతభత్యాలు ఇలా..**

నిర్వహణ, ఉద్యోగుల జీతభత్యాలు, పరిపాలన ఖర్చులు, తరుగు, వడ్డీలు కలిపి రూ.1,738.57 కోట్లు అయినట్లు ఎల్అండ్‌టీ మెట్రో రైలు సంస్థ పేర్కొంది. నిర్మాణ వ్యయానికి చేసిన అప్పులకు చెల్లించిన వడ్డీనే రూ.940.03 కోట్లుగా తెలిపింది. నిర్వహణ వ్యయం రూ.421.74 కోట్లు కాగా, తరుగు కింద రూ.302.84 కోట్లు చూపించారు. మొత్తంగా ఆర్థిక సంవత్సరంలో రూ.625.88 కోట్లు నష్టం వాటిల్లింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే నష్టాలు 13 శాతం పెరిగాయి.

**మార్చి 31, 2025 నాటికి ఖర్చు రూ.కోట్లలో**

నిర్మాణం కోసం చేసిన వ్యయం: రూ.13,046.22
ఉద్యోగుల వేతనాలు: రూ.209.38
ఫెసిలిటీ మేనేజ్‌మెంట్, కమ్యూనికేషన్: రూ.125.31
వడ్డీలు: రూ.4509.66

## ఆరోగ్యం పాడవుతుందిలా..

హైదరాబాద్: మద్యం, కల్లు బాధితులతో ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం రోగుల తాకిడి ఉంటోంది. తాజాగా కల్తీ కల్లు తాగి ఐదుగురు చనిపోవడం, మరో 30 మందికిపైగా నిమ్స్‌లో చేరడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. నగరం నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలోని డిఅడిక్షన్ కేంద్రానికి రోజూ 20-30 మంది వరకు చికిత్స కోసం వస్తున్నారు. ఆ మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు. కొందరిలో కాలేయం, కిడ్నీలు, నాడీ వ్యవస్థ దెబ్బతీస్తుంది. గుండెపోటుకూ కారణమవుతుందని వైద్యులంటున్నారు. బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన వారిలో మద్యం, కల్తీ కల్లు అలవాటు ఉన్నవారి శాతం ఎక్కువేనని చెబుతున్నారు.



**తగ్గిస్తారిలా..:**

ఎర్రగడ్డ ప్రభుత్వ మానసిక ఆరోగ్య కేంద్రంలో డీఅడిక్షన్ కేంద్రంలో మత్తు పదార్థాలకు బానిసైనవారికి ఉచిత చికిత్స అందిస్తున్నారు. ఒక్కసారిగా అలవాటు నుంచి దూరం చేస్తే రకరకాల మానసిక సమస్యలకు దారి తీస్తుంది. ఇలాంటి వారికి తొలుత డీటాక్సిఫికేషన్ చికిత్స అందిస్తారు. అనంతరం నెమ్మదిగా మత్తు అలవాటునుంచి దూరం కావడానికి యాంటి క్రేవింగ్ మందులు 3-6 నెలలపాటు తీసుకోవాలి.

**హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు**

నగరంలో జరిగిన కల్తీ కల్లు ఘటనపై న్యాయవాది రామారావు ఇమ్మానేని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం, బాధితులకు రూ.5 లక్షలు ఇప్పించాలని కోరారు.

## కూలే వరకు పట్టించుకోరా?

హైదరాబాద్: ప్రతిరోజూ వందల మంది రాకపోకలు సాగించే ట్యాంక్‌బండ్‌పై ఉన్న రహదారికి అనుసంధానించి నిర్మించిన పాదచారుల బాట అధ్వానంగా ఉంది. సికింద్రాబాద్‌కు వెళ్లే ఆర్చి నుంచి ఈ కాలిబాట ప్రారంభమవుతుంది. తొలుత కొంతవరకు వంతెన, ఆ తర్వాత రాతి కట్టడంతో కూడిన కట్ట ఉంది. ప్రస్తుతం వంతెన ప్రమాదకరస్థితికి చేరడంతో పాదచారులు భయపడుతున్నారు. 7 పిల్లర్ల పెచ్చులూడుతున్నాయి. ఇనుప చువ్వలు తేలి కనిపిస్తుండటంతోపాటు స్తంభాల మధ్యలో పగుళ్లు వచ్చాయి. ట్యాంక్‌బండ్ నిర్వహణ బాధ్యతను హెచ్ఎండీఏ చూస్తోంది. ఇక్కడ పచ్చదనం కోసం పచ్చికబయళ్లు,



మొక్కలను పెంచుతున్నారు. అయితే కాలిబాట నిర్వహణను పట్టించుకోకపోవడంతో కూలే వరకు స్పందించరా...? అని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ రవీందర్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణం పరిశీలించి మరమ్మతులు చేపడతామని చెప్పారు.

## చెల్లింపుల్లో జాప్యం

కమాన్‌పూర్ : రాష్ట్ర ప్రభుత్వం గత నవంబరులో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టింది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గ్రామాల్లో సర్వే నిర్వహించింది. సర్వే అనంతరం వివరాలను ఆన్‌లైన్ చేసేందుకు కంప్యూటర్‌పై పరిజ్ఞానం ఉన్న ఆపరేటర్లతో వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయించారు. ఒక దరఖాస్తుకు రూ.30 ఇస్తామని చెప్పడంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

**నాలుగు మండలాల్లో 42,621 దరఖాస్తులు**

మంథని నియోజకవర్గంలో నాలుగు మండలాలు, 76 గ్రామపంచాయతీలున్నాయి. 42,621 దరఖాస్తులు వచ్చాయి. సుమారు 114 మంది ఆపరేటర్లను తీసుకున్నారు. సర్వే వివరాలు నమోదు చేయడానికి ప్రభుత్వ అధికారులను సైతం వినియోగిం చుకున్నారు. రామగిరి, ముత్తారం మండలాలకు సంబంధించిన సర్వే వివరాలు ఆన్‌లైన్‌ను మంథని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు అప్పగించారు. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కొంతమందికి డబ్బులు చెల్లించినట్లు అధికారులు



చెబుతున్నారు. మంథని నియోజకవర్గంలో రూ.7లక్షల వరకు రావాల్సి ఉంది. సర్వే వివరాలు ఆన్‌లైన్ చేసిన జేఎన్టీయూ కళాశాల విద్యార్థులు, ఇతర ప్రైవేట్ ఆపరేటర్లు తరచూ ఎంపీడీవో కార్యాలయాలకు వచ్చి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పదిరోజుల పాటు..**

కులగణన సర్వే వివరాలను ఆన్‌లైన్ చేసేందుకు అవకాశం ఉందని అధికారులు చెప్పారు. కమాన్‌పూర్ ఎంపీడీవో కార్యాలయంలో పది రోజుల పాటు వివరాలను ఆన్‌లైన్ చేశా. ఒక దరఖాస్తుకు రూ.30 ఇస్తామని అధికారులు చెప్పారు. ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఇవ్వలేదు. గోలి అఖిల్, రంగాపూర్

**నిధులు విడుదల కావాల్సి ఉంది**

సర్వే వివరాలు ఆన్‌లైన్ చేసేందుకు ప్రైవేట్ ఆపరేటర్లను తీసుకున్నాం. వివరాలను ప్రభుత్వానికి పంపించాం. మార్చి 31 వరకు తిరస్కరణకు గురైన వివరాలను మళ్లీ పంపించాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది. ఉన్నతాధికారులకు మరోసారి నివేదిస్తాం. రవీందర్, ముఖ్య ప్రణాళిక అధికారి

## అనుమతి లేకున్నా.. అడ్డగోలు తవ్వకాలు



జమ్మికుంట : జమ్మికుంట మండలంలో నీటిపారుదల శాఖకు సంబంధించిన కార్యాలయం హుజూరాబాద్‌లో ఉంది. సంబంధిత ఏఈలు జమ్మికుంట, ఇల్లందకుంట మండలాలకు అందుబాటులో లేరు. దీంతో ఇదే అదునుగా జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల్లో జోరుగా మట్టి అక్రమ రవాణా జరుగుతోంది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణకు లష్కర్లున్నా.. వారు ఏమరుపాటుగా ఉన్న సమయంలో అక్రమార్కులు జోరుగా మట్టిదందా చేస్తున్నారు.

**150 ట్రాక్టర్ల మట్టి తరలింపు!**

స్థానిక నాయిన్ చెరువు శిఖం స్థలంలో మంగళవారం పొక్లెయిన్‌తో తవ్వకాలు చేసి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మట్టి తరలించారు. రెవెన్యూ, నీటిపారుదల, ఇతర ప్రభుత్వ శాఖల అనుమతి లేకుండానే సుమారు 150 ట్రాక్టర్ల మట్టిని తరలించి జమ్మికుంటలోని ఓ ప్రాంతంలో విక్రయించినట్లు ఆరోపణలున్నాయి. ట్రాక్టర్‌కు రూ.1,000 చొప్పున సుమారు రూ.1.50 లక్షల విలువైన మట్టిని విక్రయించారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఎన్.వెంకట్‌రెడ్డి, నీటిపారుదలశాఖ ఏఈ వరుణ్‌లను వివరణ కోరగా.. చెరువు శిఖం నుంచి మట్టి తరలింపునకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఈ విషయమై తహసీల్దార్‌తో మాట్లాడి విచారణ చేపడతామని ఏఈ చెప్పారు. మట్టి తరలించాలంటే ఇరిగేషన్ శాఖ ఈఈ అనుమతి అవసరమన్నారు.

**పలు ప్రాంతాల్లో ఇలా..**

జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల్లోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పేరిట మట్టిని అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ ఏడాది మే నెలలో జమ్మికుంట మండలం తనుగులలోని చాకిరికుంట, స్థానిక చెరువు నుంచి వందల ట్రాక్టర్లలో మట్టిని అక్రమంగా తరలించారు. అప్పటి ఏఈ మహేశ్ తనిఖీ చేసినా ఏ మార్పూ లేదు.

జమ్మికుంట మండలం వెంకటేశ్వరపల్లిలోని పిల్లివాని కుంటలో మట్టి తరలింపుపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ ఈ దందా ఆగలేదు.

ఇల్లందకుంట మండల కేంద్రంలోని ఎర్రగుట్ట ప్రాంతం, కనగర్తిలోని కుంట నుంచి మట్టిని అక్రమంగా ట్రాక్టర్లలో తరలించారు. యథేచ్ఛగా ఈ దందా సాగుతున్నా.. అధికారులు పట్టుకున్న దాఖలాలు లేవు. చెరువులు, కుంటల నుంచి మట్టి అక్రమ తరలింపుపై ఉన్నతాధికారులు నిఘా పెడితే రూ.లక్షల విలువ చేసే అక్రమ రవాణా ఆగుతుంది. వనరుల నష్టం జరగకుండా నిలువరించవచ్చు.

## సమిష్టిగా కదిలారు.. బడిని బతికించుకున్నారు



సిరిసిల్ల: గ్రామానికి బడి.. గుడి ఉంటేనే పరిపూర్ణత వస్తుంది. అలాంటిది కొన్నేళ్లుగా జిల్లా వ్యాప్తంగా 23 పాఠశాలలు మూతపడుతూ వచ్చాయి. ఈసారి బడి బాటలో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధనపై ఉపాధ్యాయుల ప్రచారంతో తల్లిదండ్రుల్లో మార్పువచ్చింది. ఈ విద్యాసంవత్సరం తమ పిల్లల్ని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించారు. దీంతో జిల్లాలో అయిదు పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఇంకా చాలా పాఠశాలల్లో ప్రవేశాలు లేక మూతపడి.. భవనాలకు తాళాలు వేసి ఉన్నాయి.

**మార్పులు చేర్పులతో..**

జిల్లాలో 2024-25 విద్యాసంవత్సరం 510 ప్రభుత్వ పాఠశాలు, కేజీబీవీలు, గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు కలిపి 37,720 మందికి గాను ఈ ఏడాది బడిబాట ముగిసే నాటికి 36,278 మంది విద్యార్థులున్నారు. మొత్తంగా విద్యార్థుల సంఖ్య తగ్గినప్పటికీ అయిదు పాఠశాలలు ప్రారంభంకావడం ఊరటనిచ్చే అంశం. వీటిలో ఇల్లంతకుంట మండలం ఎర్రనర్సుపల్లి, ముస్తాబాద్ మండలం లంబాడితండా, పొత్గల్‌లోని జడ్పీహెచ్ఎస్ బాలికలు, రుద్రంగి మండలం వీరునితండా, సిరిసిల్ల పట్టణంలోని అశోక్‌నగర్ ప్రాథమిక పాఠశాలలు ప్రారంభమయ్యాయి.

పొత్గల్ జిల్లా పరిషత్తు బాలికల పాఠశాల 15 మంది బాలికలతో ప్రారంభించారు. 2016లో ప్రవేశాల్లేక మూతపడింది. ఈ పాఠశాలలోని ఉపాధ్యాయులను పక్కనే ఉన్న బాలుర పాఠశాలలోకి డిప్యూటేషన్ వేశారు.

రుద్రంగి మండలం వీరునితండా ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. కలెక్టర్ తనిఖీలో ఈ విషయం తెలియడంతో ఉపాధ్యాయులను విద్యార్థులను పక్కనే కిలోమీటరు దూరంలోని దెగావత్‌తండాలోకి మార్చారు. ఈ ఏడాది గ్రామంలో బడి ఉండాలని 8 మంది విద్యార్థులను చేర్పించారు. ప్రస్తుతం ఒక ఉపాధ్యాయునితో ఈ పాఠశాల ప్రారంభమైంది.

సిరిసిల్ల పట్టణంలోని ఆశోక్‌నగర్ ప్రాథమిక పాఠశాల 2019లో మూతపడింది. ఈ ఏడాది తొమ్మిది మంది విద్యార్థులతో ప్రారంభించారు. కాగా ఈ పాఠశాలలో టీజీఈడబ్ల్యుఐడీసీ (రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ) కార్యాలయం నిర్వహిస్తున్నారు. గదులు ఖాళీలేకపోవడంతో పద్మానగర్‌లోని పాఠశాలలో తరగతులు జరుగుతున్నాయి.

కోనరావుపేట, ముస్తాబాద్, వేములవాడ గ్రామీణ, చందుర్తి, తంగళ్లపల్లి, రుద్రంగి మండలాల్లోని చాలా గ్రామాల్లో పాఠశాలలు మూతపడి ఉన్నాయి. తక్కువ మంది విద్యార్థులున్నవి, ఏకోపాధ్యాయ పాఠశాలలు కూడా ఉన్నాయి.

## ఆయకట్టు.. గుటుక్కు గట్టు..!

సూర్యాపేట : జిల్లాలో ఎస్సారెస్పీ కాలువ భూములను అక్రమార్కులు వదలడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పలువురు కబ్జాకు పాల్పడుతున్నారు. పర్యవేక్షణ, ఇతరత్రా అవసరాల కోసం కాలువకు ఇరువైపులా కేటాయించిన భూములను పక్క రైతులు తమ సాగు భూముల్లో కలిపేసుకుంటూ పంట పండిస్తున్నారు. వారి ఆక్రమణలతో నీటి సరఫరా సమయంలో క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కొన్ని కాల్వల చివరి వరకు నీటిపారుదలశాఖ అధికారులు వెళ్లలేని దుస్థితి. చివరి ఆయకట్టు రైతులు కూడా తమ పంట క్షేత్రాలకు వెళ్లేందుకు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

ఎస్సారెస్పీ రెండో దశలో అత్యధికంగా సాగుజలాలను సూర్యాపేట జిల్లాకు అందించేలా నిర్మించారు. డీబీఎంలకు ఒక వైపు సుమారు 40 అడుగులు, మరో వైపు 43 అడుగులు, డీబీఎంల నుంచి పంటపొలాలకు నీరందేలా నిర్మించిన ఉప కాలువలకు ఒక వైపు దాదాపు 30 మరో వైపు 33 అడుగుల చొప్పున భూములు ఉండాలి. వాటిలోని ఒక వైపు నుంచి కాలువల పర్యవేక్షణ కోసం అధికారుల వాహనాల్లో రాకపోకలు సాగించాలి. అంతటి విస్తీర్ణం కలిగిన భూములు కొన్నిచోట్ల ఒక వైపు పూర్తిగా కబ్జాకు గురయ్యాయి. అనుకోని సందర్భాల్లో డీబీఎం కాలువలకు గండ్లు పడితే అప్పటికప్పుడు పూడ్చడానికి మట్టి(మొరం) కట్టలుండాలి. కాగా ఈ మట్టిపై అక్రమార్కుల కన్నుపడింది. మద్దిరాల, నూతనకల్, తుంగతుర్తి, తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో సాగు భూముల మీదుగా నిర్మించిన కాలువకు



ఇరువైపులా ఉన్న భూములు ఆక్రమణకు గురయ్యాయి.

నీటి సరఫరా సమయంలో మునగాల, నడిగూడెం, మోతె మండలాల్లోని చివరి ఆయకట్టుకు సాగునీరందని పరిస్థితి. ముఖ్యంగా యాసంగి సమయంలో నీరందేలా చూడాలని అన్నదాతలు అధికారులకు విన్నవించుకున్నా ప్రయోజనం ఉండటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో చాలావరకు కాలువ పక్కన స్థలాలను కొందరు తమ సాగుభూముల్లో కలిపేసుకున్నారు.

డీబీఎం-69 పరిధిలోని తుంగతుర్తి మండలం గుడితండా మీదుగా నూతనకల్ మండలం చిల్పకుంట శివారు పంటపొలాల మీదుగా వెళ్లే 21ఆర్ ఉపకాలువ ఇది. కొన్నిచోట్ల కుడివైపు, మరి కొన్ని చోట్ల ఎడమవైపు కిలోమీటర్ల పొడవునా అక్రమించుకొని సాగుభూమిగా మార్చుకుని వరి, పత్తి పంటలను సాగు చేస్తున్నారు.

మద్దిరాల మండలం రెడ్డిగూడెం శివారులోని డీబీఎం-60 కాలువ ఇది. మద్దిరాల నుంచి ముకుందాపురం, చిన్ననెమిల మీదుగా పాలేరు వాగు సమీపం వరకు వెళ్తుంది. కాలువ పక్కన దాదాపు 40 అడుగుల వెడల్పుతో ఉండాల్సిన భూమి కబ్జాకు గురికాగా 15 అడుగులకు మిగిలింది.

**హద్దులు ఏర్పాటు చేస్తాం**

హరికృష్ణ, డీఈఈ, నీటిపారుదలశాఖ

కాలువలో ఉన్న చెత్తను, చెట్లను తొలగిస్తున్నాం. రికార్డుల ప్రకారం కాలువకు ఇరువైపులా ఉన్న భూముల్లో హద్దులు ఏర్పాటు చేస్తాం. వనమహోత్సవంలో భాగంగా ఆ భూముల్లో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

## సామగ్రి పంచి.. ఆసక్తి పెంచి

కోదాడ : అటల్ ఇన్నోవేషన్ మిషన్(ఏఐఎం)లో భాగంగా పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్)లను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ల్యాబ్‌లకు కేంద్రం చొరవతో రూ.10లక్షల విలువైన బోధన సామగ్రిని ఇటీవల అందించారు. విద్యార్థుల్లో సైన్స్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం సబ్జెక్టులపై ఆసక్తిని పెంచుకోవడమే వీటి ప్రధాన లక్ష్యం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), రోబోటిక్స్, త్రీడీ ప్రింటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ) తదితర అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాల్లోనూ ప్రభుత్వ విద్యార్థులను తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోంది.

ఈ ఏడాది సూర్యాపేట జిల్లాలోని 21 పీఎంశ్రీ పాఠశాలలకు ఈ అధునాతన బోధనా సామగ్రిని ఇటీవల పంపిణీ చేశారు. ఎలక్ట్రానిక్స్, రోబోటిక్స్ వంటి పరికరాలతో పాటు ఐఎఫ్ఎల్ ప్యానెల్, ల్యాప్‌టాప్, ఆండ్రాయిడ్ బాక్స్ ఒక్కొక్కటి చొప్పున, ఆరు వర్క్ స్టేషన్లు, ఫ్లోర్ మ్యాట్, రెండు అగ్నిమాపక పరికరాలు వీటిలో ఉన్నాయి.

**ఉపాధ్యాయులకు శిక్షణ**

పాఠశాలలకు అందించిన పరికరాలపై ఉపాధ్యాయులకు ఈనెల 22, 23 తేదీల్లో శిక్షణ ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆరుగురు



నిపుణులు జిల్లాకు రానున్నారు. ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురు చొప్పున 21 పాఠశాలల నుంచి 63 మంది ఉపాధ్యాయులు శిక్షణకు హాజరు కానున్నారు. 30, 33 మందితో రెండు పాఠశాలల్లో శిక్షణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**సాంకేతిక రంగంలో పోటీపడేలా**

ఎల్.దేవరాజ్, జిల్లా సైన్స్ అధికారి

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులు సాంకేతిక రంగంలో పోటీపడేలా చూడటమే అటల్ టింకరింగ్ ల్యాబ్స్ లక్ష్యం. జిల్లాలోని సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గ ఉపాధ్యాయులకు అనాజీపురంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయులకు కోదాడలోని పీఎంశ్రీ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణ జరుగుతుంది.



# ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే లక్ష్యం

అమరావతి: అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ సోదర సోదరీమణులకు ఏపీ సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఏజెన్సీ ప్రాంతాలను మైదాన ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. రానున్న రోజుల్లో చేపట్టే కార్యక్రమాలపై వారితో చర్చించి నేడు నిర్ణయాలు ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఆదివాసీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.

**ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దం: లోకేశ్...** మంత్రి లోకేశ్ గిరిజనులకు 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే జీవనశైలి ఆదివాసుల సొంతమన్నారు. కూటమి ప్రభుత్వంలో వారి సంక్షేమం కోసం నిత్యం కృషి చేస్తున్నామని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.7,557 కోట్ల నిధులు విడుదల చేసినట్లు వివరించారు. భవిష్యత్‌లోనూ వారికి అన్నివిధాలా అండగా నిలుస్తామన్నారు.



# ముంచెత్తిన వాన.. ఢిల్లీకి రెడ్ అలర్ట్

ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీని భారీ వర్షాలు ముంచెత్తాయి. నిన్న రాత్రి నుంచి కురుస్తున్న కుంభవృష్టితో పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు నదులను తలపిస్తున్నాయి. శనివారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. మరోవైపు వర్షాల నేపథ్యంలో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. 200లకు పైగా విమానాలు ఆలస్యమయ్యాయి. వర్షం కారణంగా కన్నాట్ ప్యాలెస్, మథుర రోడ్డు, భారత్ మండపం తదితర ప్రాంతాల్లో భారీగా నీరు చేరింది. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే దాదాపు 210 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. వర్షాల నేపథ్యంలో ఢిల్లీ ఎయిర్‌పోర్టు అడ్వైజరీ జారీ చేసింది. విమాన సర్వీసులకు సంబంధించి ప్రయాణికులు ఎప్పటికప్పుడు తమ తమ ఎయిర్‌లైన్ల నుంచి తాజా సమాచారం తెలుసుకోవాలని సూచించింది. అటు ఇండిగో, స్పైస్‌జెట్ వంటి సంస్థలు కూడా అడ్వైజరీ విడుదల చేశాయి. ప్రతికూల వాతావరణం కారణంగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయని, ప్రయాణికులు సహకరించాలని కోరాయి. మరోవైపు, శనివారం కూడా ఢిల్లీ వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీంతో దేశ రాజధానికి రెడ్ అలర్ట్ జారీ చేసింది. అటు హిమాచల్‌ప్రదేశ్ సహా పలు ఉత్తరాది రాష్ట్రాల్లోనూ వర్షాలు కురుస్తున్నాయి.




# మరో రికార్డు..

అమరావతి : సత్వర న్యాయం, పటిష్టమైన పోలీసింగ్‌లో దేశంలోనే రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నిలిచింది. ప్రజలకు న్యాయ సహాయం అందించటంలో, శాంతిభద్రతల్లో ఏపీ టాప్‌లో ఉందని ఇండియా జస్టిస్ రిపోర్టు 2025 వెల్లడించింది.

జగన్ హయాంలో రాజకీయ ప్రతీకారాలు, ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేసేందుకు పోలీసు వ్యవస్థను దుర్వినియోగంతో ర్యాంకింగ్‌లో దిగువకు పడిపోయింది ఆంధ్రప్రదేశ్. 2019 నుంచి 2024 వరకు ఈ అంశాల్లో పడిపోయింది ఏపీ ర్యాంకింగ్. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీలో చట్టబద్ధ పాలన తిరిగి వచ్చినట్లుగా వెల్లడించింది ఇండియా జస్టిస్ రిపోర్టు. పోలీసింగ్‌తో పాటు న్యాయ సహకారాన్ని అందించటంలో ఏపీ పనితీరు మెరుగైనట్లుగా స్పష్టం చేసింది ఇండియా జస్టిస్ రిపోర్టు 2025. ఏపీలో శాంతిభద్రతలు, పోలీసింగ్, న్యాయవ్యవస్థ పనితీరు, సామాజిక, చట్టపరమైన పాలన తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఏపీకి ఈ ర్యాంకింగ్ కేటాయించింది. ఇండియా జస్టిస్ రిపోర్టులో 6.78 స్కోర్‌తో మొదటిస్థానంలో కర్ణాటక నిలిచింది.

6.32 స్కోర్‌తో రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలిచింది. తర్వాత స్థానాల్లో తెలంగాణ, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు ఉన్నాయి. రాష్ట్రంలో శాంతిభద్రతల సరైన నిర్వహణను కఠినంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తూ ప్రశంసలు అందుకుంటుంది.



# మంగళగిరి మహిళలే నాకు అక్కాచెల్లెళ్లు

మంగళగిరి: అందరి ఆశీస్సులతో మంగళగిరిని నంబర్ 1గా తీర్చిదిద్దుతానని మంత్రి నారా లోకేశ్ (%చ్ఘిుఖీు ాశీఎవంష్ట్ర%) తెలిపారు. సోదరి లేని తనకు మంగళగిరి మహిళలే అక్కాచెల్లెళ్లు అని అన్నారు. ఉండవల్లి నివాసంలో మంత్రికి మంగళగిరి మహిళలు పెద్ద ఎత్తున రాఖీలు కట్టారు.

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. రాఖీకట్టి తనకు అందించిన ఆశీస్సులు కొండంత బలాన్నిచ్చాయన్నారు. "మంగళగిరి ఆడబిడ్డలందరికీ నేను ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను. మంగళగిరిలో త్వరలోనే మరో విడత ఇళ్ల పట్టాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో 200 అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్, గ్యాస్ పైప్‌లైన్ల ఏర్పాటు, 100 పడకల ఆసుపత్రి, స్వర్ణకారుల కోసం జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కు వంటివి పురోగతిలో ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లన్నీ అభివృద్ధి చేస్తున్నాం. మహా ప్రస్థానం పేరుతో శ్మశాన వాటికల నిర్మాణం, పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా మంగళగిరి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం" అని పేర్కొన్నారు.

## బీసీ నేతలపై అక్రమ కేసులు పెట్టిన చరిత్ర వైకాపాది: మంత్రి కొల్లు రవీంద్ర



అమరావతి: నేటి నుంచి 4 రోజుల పాటు బీసీల కృతజ్ఞతా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. బీసీలకు చేసిన సంక్షేమంపై చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేస్తామన్నారు. కుల సంఘాల ఆధ్వర్యంలో సీఎంకు కృతజ్ఞతలు చెబుతామని చెప్పారు. శని, ఆదివారాల్లో కల్లు గీత కార్మికులతో కృతజ్ఞత సమావేశాలు ఉంటాయన్నారు.

ఈ నెల 11న చేనేత కార్మికుల ఆధ్వర్యంలో 100 అడుగుల వస్త్రాలతో ర్యాలీలు నిర్వహిస్తామని తెలిపారు. బీసీలకు మొదటి నుంచి గుర్తింపు ఇచ్చింది తెదేపానే అని పేర్కొన్నారు. బీసీ నేతలపై అక్రమ కేసులు పెట్టి జైల్లోకి పంపించిన చరిత్ర వైకాపాది అని విమర్శించారు.

## కలకలం రేపిన రెండు నెలల చిన్నారి విక్రయం




బాపట్ల: ఓ మహిళ తన రెండు నెలల చిన్నారిని విక్రయించిన ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. బాపట్లకు చెందిన మహిళ తన రెండు నెలల చిన్నారిని కృష్ణాజిల్లా అవనిగడ్డకు చెందిన దంపతులకు విక్రయించింది. మధ్యవర్తుల ద్వారా నగదు లావాదేవీల్లో వివాదం తలెత్తడంతో ఆ పంచాయితీ రేపల్లె పట్టణ పోలీసుల వద్దకు వెళ్లింది. పోలీసులు తల్లీబిడ్డలను బాపట్ల పంపించారు. స్థానిక పోలీసులు ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించడంతో చిన్నారిని బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. తల్లిని సఖి వన్ స్టాప్ కేంద్రానికి తరలించి అధికారులు కౌన్సిలింగ్ చేస్తున్నారు. ఈ మహిళ గతంలోనూ రెండు నెలల బాలుడిని కావలికి చెందిన దంపతులకు విక్రయించిందని, ఆ తర్వాత బిడ్డ తనకు కావాలంటూ పోలీసులను ఆశ్రయించిందన్నారు. దీనిపై బాపట్ల పట్టణ సీఐ రాంబాబును సంప్రదించగా అధికారికంగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## వాళ్లకు వాళ్లే దాడులు చేసుకుని మాపై నిందలా..?: బీటెక్ రవి

కడప: జడ్పీటీసీ ఉపఎన్నిక సందర్భంగా వైకాపా నేతలు వాళ్లకు వాళ్లే దాడి చేసుకుని తమపై నింద వేయడానికి ప్లాన్ చేస్తున్నా రని పులివెందుల తెదేపా ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి విమర్శించారు. స్వతంత్ర అభ్యర్థులుగా



వైకాపా పార్టీ వ్యక్తులే నామినేషన్ వేశారని చెప్పారు. ఆ పార్టీ వారు కుట్రలు చేస్తూ తమపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. పోలీసులు, ఎన్నికల కమిషన్ ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల రోజు ఏం జరిగినా తనకు సంబంధం లేదని పేర్కొన్నారు.

## గత ప్రభుత్వం పేదలకు వైద్యం దూరం చేసింది

నిమ్మాడ: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో 18 మందికి రూ.24 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం



నిధులు పక్కదారి పట్టించి పేదలకు వైద్యం దూరం చేసిందన్నారు. చంద్రబాబు సీఎం కాగానే రూ.400 కోట్లు లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. టెక్కలి నియోజకవర్గంలో ఇప్పటికే 81 మందికి చెక్కులు అందించినట్లు అచ్చెన్నాయుడు చెప్పారు.



# భారత్ ఓపిక పడితే.. ట్రంప్ పేకమేడ కూలుతుంది..!

ఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ వార్‌పై స్వదేశంలోనూ వ్యతిరేకత ఎదురవుతోంది. ఈ సుంకాల వల్ల అమెరికా ప్రజలకే ఎక్కువ నష్టం వాటిల్లనుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా అమెరికా ఆర్థికవేత్త, జాన్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ స్టీవ్ హాంకీ కూడా ఇదేవిధమైన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. సుంకాల పేరుతో ట్రంప్ కడుతున్న పేక మేడ త్వరలోనే కూలిపోతుందని దుయ్యబట్టారు. అప్పటివరకు భారత్ ఆయన జోలికి వెళ్లకపోవడమే మంచిదని సూచించారు. జాతీయమీడియా సంస్థ ఎన్డీటీవీతో మాట్లాడిన స్టీవ్ హాంకీ.. భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాల అంశాన్ని ప్రస్తావించారు. "సుంకాలపై ట్రంప్ నిర్ణయాలు పూర్తిగా అర్థరహితం. ఇక్కడో విషయం చెప్పాలి.

'తనను తాను నాశనం చేసుకునే శత్రువు జోలికి వెళ్లకపోవడమే మంచిద'నేది నెపోలియన్ మాట. ఇప్పుడు ట్రంప్ కూడా ప్రపంచదేశాలతో వాణిజ్య యుద్ధాలు చేస్తూ తనను తానే నాశనం చేసుకుంటున్నారని అనిపిస్తోంది. భారత్ విషయాని కొస్తే.. ప్రస్తుతం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్ కొంతకాలం ఓపిక పట్టి ఎదురుచూడాలి. ఎందుకంటే ట్రంప్ పేకమేడ త్వరలోనే కూలిపోతుంది" అని ఆ ప్రొఫెసర్ అభిప్రా యపడ్డారు. అమెరికన్ల వినిమయ ఖర్చులు పెరిగితే తమ దేశ ద్రవ్యలోటు ఎక్కువవుతుందని హాంకీ అంచనా వేశారు. టారిఫ్‌లపై ట్రంప్ విధానాలు చాలా చెత్తగా ఉన్నాయని దుయ్యబట్టారు. దీనివల్ల తమ ఆర్థికవ్యవస్థకే నష్టం చేకూరే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. రష్యా చమురును కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై సుంకాలను ట్రంప్ రెట్టింపు చేసి 50శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. ఈ సుంకాల విషయం తేలేవరకు న్యూదిల్లీతో వాణిజ్య చర్చలు కూడా జరపబోమని తేల్చిచెప్పారు. దీంతో ఇరుదేశాల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి.

ట్రంప్ నిర్ణయాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది అన్యాయమైన, అసమంజసమైన చర్య అని పేర్కొంది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని న్యూదిల్లీ స్పష్టం చేసింది.

## తిరంగాయాత్రలు, మౌన ర్యాలీలతో స్వాతంత్ర్య వేడుకలు: పీవీఎన్ మాధవ్



విజయవాడ : రేపటి నుంచి ఏపీవ్యాప్తంగా తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఇవాళ(శనివారం) మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి బీజేపీ నేతలతో పీవీఎన్ మాధవ్ ఆడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ్ మీడియాతో మాట్లాడారు.

ఆగస్టు 14వ తేదీ నుంచి దేశ విభజన గాయాన్ని పురస్కరించుకుని మౌన ప్రదర్శనలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రేపటి నుంచి మండల, జిల్లా స్థాయిలో తిరంగా ర్యాలీ నిర్వహించాలని సూచించారు పీవీఎన్ మాధవ్. ఆజాదికా అమృత మహోత్సవం నుంచి బీజేపీ పరంగా ప్రతి సంవత్సరం తిరంగాయాత్రలు నిర్వహిస్తున్నామని వ్యాఖ్యానించారు. రేపటి నుంచి 14వ తేదీ వరకు తిరంగాయాత్రలు చేపడుతున్నట్లు తెలిపారు. తిరంగాయాత్రలు నిర్వహిస్తూ స్థానికంగా స్వాతంత్ర్య సమర యోధుల విగ్రహాలను పరిశుభ్రం చేయాలని సూచించారు. స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాల వద్దకు వెళ్లి అక్కడ స్వాతంత్ర్య సమర యోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించాలని దిశానిర్దేశం చేశారు పీవీఎన్ మాధవ్ . వీర మరణం పొందిన సైనికుల కుటుంబాలను పరామర్శించి, అంజలి ఘటించాలని సూచించారు. ఆగస్టు 14వ తేదీ దేశ విభజన జరిగిన రోజును.. ఒక కాళరాత్రిగా జాతీయవాదులం అందరం భావిస్తామని చెప్పుకొచ్చారు. అందువల్ల ఆ రోజు జిల్లా స్థాయిలో విభజన సమయంలో ఏర్పడిన పరిస్థితులపై ఒక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని మార్గనిర్దేశం చేశారు. ఈనెల(ఆగస్టు) 14వ తేదీ సాయంత్రం క్యాండిల్ లేదా కాగడాలను చేత బూని మౌన ర్యాలీలు నిర్వహించి ర్యాలీ అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడాలని సూచించారు పీవీఎన్ మాధవ్. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు.

ఈ నెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జాతీయ జెండాను బీజేపీ శ్రేణులు తమ ఇళ్లపై కుటుంబ సభ్యులతో కలసి పతాక ఆవిష్కరణలు చేసి సెల్ఫీ తీసుకోవాలని సూచించారు. బీజేపీ పార్టీ కార్యాలయంలో, బహిరంగ ప్రదేశాల్లో పతాక ఆవిష్కరణలకు స్థానికులను భాగస్వామ్యం చేసి ఒక పండుగ వాతావరణంలో ఆగస్టు 15 వేడుకలు నిర్వహించాలని పీవీఎన్ మాధవ్ సూచించారు.



## పోలీసులకు రాఖీ కట్టిన హెూంమంత్రి అనిత

విశాఖ: రక్షాబంధన్ సందర్భంగా విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు హెూంమంత్రి అనిత రాఖీ కట్టి సోదరభావాన్ని వ్యక్తం చేశారు. విశాఖ ఎంవీపీ కాలనీ నుంచి ఉషోదయ జంక్షన్ వరకు ఆటోలో ప్రయాణించారు.

ఆటోడ్రైవర్ గిరీశ్ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనకు కూడా రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న కానిస్టేబుల్ కొర్లయ్యను పరామర్శించి రాఖీ కట్టారు. ఆయనకు ధైర్యం చెప్పిన మంత్రి.. సహాయం అందిస్తామన్నారు.

# బీచ్‌లు సిస్టర్స్ ముద్దు రచ్చ రచ్చ

టాలీవుడ్ స్టార్ హీరోయిన్స్‌లో కాజల్ అగర్వాల్ ఒకరు అనడంలో సందేహం లేదు. సుదీర్ఘ కాలంగా కాజల్ అగర్వాల్ టాలీవుడ్‌లో కొనసాగుతోంది. గత రెండు మూడు సంవత్సరాలుగా కాజల్ సినిమాలు తగ్గాయి, కానీ ఆమెకు ఉన్న క్రేజ్ మాత్రం తగ్గలేదు. పెళ్లి చేసుకుని, తల్లి అయిన తర్వాత కూడా ముందులా నటించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ టాలీవుడ్‌లో ఆమెకు మునుపటి మాదిరిగా సినిమా ఆఫర్లు రావడం లేదు. తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఈ అమ్మడికి ఉన్న గౌరవం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. హీరోయిన్‌గా కాజల్ చేసిన ఎన్నో సినిమాలు సూపర్ డూపర్ హిట్‌గా నిలిచాయి. కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా ఇతర భాషల్లోనూ నటించి మెప్పించిన ముద్దుగుమ్మ కాజల్ అగర్వాల్ అనే విషయం తెల్సిందే. ఇటీవల మంచు విష్ణు హీరోగా వచ్చిన 'కన్నప్ప' సినిమాలోనూ అత్యంత కీలకమైన పార్వతిదేవి పాత్రలో కాజల్ అగర్వాల్ నటించి మెప్పించింది. ఈ మధ్య కాలంలో లీడ్ రోల్స్ కాకుండా ఇలా గెస్ట్ అప్పియరెన్స్ ఇస్తూ వస్తున్న కాజల్ అగర్వాల్ ఛాన్స్ లభిస్తే లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో నటించేందుకు, యాక్షన్ సీన్స్ కు కూడా రెడీ అన్నట్లుగా చెప్పుకొచ్చింది.



హీరోయిన్‌గా సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న కాజల్ అగర్వాల్ ఇప్పటికీ అదే అందం, అదే ఫిజిక్‌తో చూపు తిప్పుకోనివ్వడం లేదు. తాజాగా మరోసారి కాజల్ అగర్వాల్ ఫోటోలు ఇన్‌స్టాలో వైరల్ అవుతున్నాయి. ఈసారి ఆమె సిస్టర్ నిషా అగర్వాల్‌తో ఉన్న ఫోటోలు కావడంతో పాటు బీచ్‌లో బికినీలో ఉండటంతో మరింతగా చూపు ఆకర్షిస్తున్నాయి. కాజల్ అగర్వాల్ పుట్టిన రోజు సందర్భంగా ట్రిప్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆ ట్రిప్‌లో తీసుకున్న ఫోటోలను అప్పుడప్పుడు షేర్ చేస్తూ వస్తుంది. తాజాగా నిషా అగర్వాల్ షేర్ చేసిన ఫోటోలు వైరల్ అయ్యాయి. కాజల్ అగర్వాల్‌కి బీచ్‌లో కూర్చుని ముద్దు పెట్టడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇద్దరు సిస్టర్స్ బీచ్‌లో బికినీలో ఉన్నారు. సాధారణంగానే ముద్దుగుమ్మలు బీచ్‌లో బికినీలో ఉంటే చూపు తిప్పడం కష్టం. అలాంటిది ఇద్దరు సిస్టర్స్ బికినీలో ఉండటంతో చూపు తిప్పలేక పోతున్నాం అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. కాజల్ అగర్వాల్ మాత్రమే కాకుండా నిషా అగర్వాల్ కూడా చాలా అందంగా ఉందని నెట్టింట కామెంట్స్ వినిపిస్తున్నాయి. సముద్రంలో వీరిద్దరూ సరదాగా తీసుకున్న ఈ ఫోటోలు నెట్టింట తెగ వైరల్ కావడంతో నిషా అగర్వాల్‌కి అదృష్టం కలిసి రాలేదు కానీ, స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశం దక్కి ఉంటే తప్పకుండా పెద్ద హీరోయిన్‌గా పేరు దక్కించుకుని ఉండేది అంటూ నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నిషా అగర్వాల్ పలు సినిమాల్లో నటించినప్పటికి లక్ కలిసి రాకపోవడంతో హిట్ పడలేదు. దాంతో అక్క కాజల్ కంటే ముందే పెళ్లి చేసుకుని వైవాహిక జీవితంలో స్థిర పడింది. ఇప్పుడు చెల్లితో పాటు అక్క కాజల్ అగర్వాల్ కూడా సంసార జీవితంలో స్థిర పడింది. వీరిని ఇలా చూసిన వారు చాలా మంది ఇద్దరు కలిసి ఏదైనా ఒక సినిమాలో నటిస్తే బాగుండేది అనే అభిప్రాయంను వ్యక్తం చేస్తున్నారు.

# రష్మిక ది గర్ల్ ఫ్రెండ్ కి బంపర్ ఆఫర్..!

నేషనల్ క్రష్ రష్మిక మందన్న రీసెంట్ గా కుబేర తో మరో సూపర్ హిట్ అందుకున్న విషయం తెలిసిందే. కుబేర సినిమాలో రష్మిక రోల్ చాలా ఎక్కువ రన్ టైం తో ఉన్నా కూడా ఆమె ఇంపాక్ట్ సినిమా అంతా ఉంది. అందుకే రష్మిక ఈ సినిమా సక్సెస్ లో భాగమైంది అన్నట్టుగా చెప్పొచ్చు. అదీగాక రష్మిక సినిమాలో ఉంటో లక్ కలిసి వస్తుంది అన్నది మరోసారి కుబేరాతో ప్రూవ్ అయ్యింది. కుబేర సినిమా తెలుగులో సూపర్ హిట్ కాగా కోలీవుడ్ లో ఆశించిన రేంజ్ రీచ్ అందుకోలేదు. ఇదిలా ఉంటే రష్మిక కుబేర హిట్ అవ్వడంతో ఆమె చేస్తున్న నెక్స్ట్ సినిమాల మీద ఆ ఎఫెక్ట్ ఉంది. రష్మిక ప్రస్తుతం ది గర్ల్ ఫ్రెండ్ సినిమా చేస్తుంది. ఈ సినిమాలో దీక్షిత్ శెట్టి మేల్ లీడ్ గా నటిస్తున్నాడు. దసరా సినిమాలో అతని ప్రతిభ చాటాడు. ది గర్ల్ ఫ్రెండ్ లో రష్మికతో స్క్రీన్ షేర్ చేసుకుంటున్నాడు. ఐతే వరుస సినిమాలు హిట్లు కొడుతుండటం వల్ల రష్మిక చేస్తున్న ది గర్ల్ ఫ్రెండ్



సినిమాకు సూపర్ డిమాండ్ ఏర్పడింది. ది గర్ల్ ఫ్రెండ్ సినిమాను పాన్ ఇండియా రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. ఐతే రష్మిక ఉన్న ఫాం చూసిన హిందీ మేకర్స్ ఆమె నటిస్తున్న ది గర్ల్ ఫ్రెండ్ సినిమాను భారీ మొత్తానికి కొనేశారట. మిగతా భాషల్లో కూడా ఆ సినిమాకు మంచి బిజినెస్ జరుగుతుందని తెలుస్తుంది. రష్మిక సినిమాలో ఉంది అంటే నేషనల్ వైడ్ గా డిస్ట్రిబ్యూటర్స్ ఆసక్తి చూపిస్తున్నారు. ఆ ఇంపాక్ట్ తో ది గర్ల్ ఫ్రెండ్ సినిమా బిజినెస్ అనుకున్న దానికన్నా బాగా జరిగిందని తెలుస్తుంది. ది గర్ల్ ఫ్రెండ్ సినిమా కూడా హిట్ పడితే మాత్రం తప్పకుండా రష్మిక రేంజ్ మరింత పెరిగే ఛాన్స్ ఉంటుంది. ఇప్పటికే బాలీవుడ్ టాలీవుడ్ అన్న తేడా లేకుండా పాన్ ఇండియా లెవెల్ లో దూసుకెళ్తుంది.. రష్మిక ఫిమేల్ సెంట్రిక్ మూవీగా చేస్తున్న ది గ్రల్ ఫ్రెండ్ హిట్ అయితే బాలీవుడ్ లో కూడా ఇలాంటి మరిన్ని సినిమాలు చేసే ఛాన్స్ ఉంటుంది. ది గర్ల్ ఫ్రెండ్ సినిమాను రాహుల్ రవింద్రన్ డైరెక్ట్ చేస్తున్నాడు. రష్మిక ది గర్ల్ ఫ్రెండ్ రిలీజ్ ఎప్పుడు సినిమా అప్డేట్స్ ఎప్పుడిస్తారంటూ నేషనల్ క్రష్ ఫ్యాన్స్ సూపర్ ఎగ్జైటెడ్ గా ఉన్నారు.





# రాజాసాబ్.. ఏది రైట్?



టాలీవుడ్ నుంచి రాబోతున్న తర్వాతి భారీ చిత్రాల్లో 'రాజా సాబ్' ఒకటి. ముందు ఈ చిత్రాన్ని వేసవిలోనే రిలీజ్ చేయాలని అనుకున్నారు. కానీ షూట్ ఆలస్యం కావడంతో వాయిదా పడిపోయింది. అనుకున్న దాని కంటే చాలా ఆలస్యంగా డిసెంబరు 5న ఈ సినిమాను రిలీజ్ చేయాలని డిసైడయ్యారు. కానీ ఇప్పుడు చూస్తే ఆ డేట్ కూడా మారిపోతుందని వార్తలు వస్తున్నాయి. సంక్రాంతి రిలీజ్ గురించి సీరియస్‌గా ఆలోచిస్తున్నారు. కానీ ఈసారి డేట్ మార్చడానికి కారణం.. చిత్రీకరణలో ఆలస్యం కాదు. అక్టోబరు చివరికల్లా సినిమా రెడీ అయిపోతుందని.. ఐతే సంక్రాంతి రిలీజ్ అయితే బాగుంటుందన్న ఉద్దేశంతో ఆలోచిస్తున్నామని నిర్మాత విశ్వ ప్రసాద్ తాజాగా క్లారిటీ ఇచ్చారు. సంక్రాంతికి ఇలాంటి పెద్ద సినిమా రిలీజైతే బాగానే ఉంటుంది కానీ.. అది ఈ చిత్రంతో పాటు వేరే సినిమాల రెవెన్యూనూ దెబ్బ తీస్తుందనే చర్చ కూడా జరుగుతోంది. ఈ స్థాయి సినిమాకు సంక్రాంతి రిలీజే కావాలా అన్నది ప్రశ్న. ప్రభాస్ సినిమా ఎప్పుడు వస్తే అప్పుడు పండగే. ఇలాంటి పాన్ ఇండియా సినిమాలకు సోలో డేట్ ఉంటేనే బాగుంటుంది. సంక్రాంతి సినిమాలకు టాక్ బాగుంటే మామూలు కంటే కొంచెం ఎక్కువ వసూళ్లే వస్తాయన్నది వాస్తవం. కానీ ఆ సమయంలో పోటీ వల్ల థియేటర్లు తగ్గిపోతాయి. అవతల వేరే సినిమాలు కూడా బాగుంటే.. రెవన్యూ షేర్ అయిపోతుంది. ఇక టాక్ అటు ఇటుగా ఉంటే ఆ సినిమా మీద తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. వచ్చే సంక్రాంతికి ఆల్రెడీ చిరంజీవి-అనిల్ రావిపూడి సినిమా.. రవితేజ-కిషోర్ తిరుమల చిత్రం.. అనగనగా ఒక రాజు చిత్రాలు షెడ్యూల్ అయి ఉన్నాయి. 'రాజాసాబ్' వస్తే వాటికి ఇబ్బంది తప్పదు. థియేటర్ల పరంగా ఘర్షణ తప్పదు. దాని బదులు డిసెంబరు 5న సినిమాను రిలీజ్ చేస్తే తెలుగు రాష్ట్రాల్లోనే కాక పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాకు భారీ రిలీజ్ దక్కుతుంది. పోటీయే ఉండదు. టాక్ బాగుంటే వసూళు ఊహించని స్థాయిలో ఉంటాయి. ఇలాంటి భారీ చిత్రాలకు పండుగ డేట్ అవసరం లేదని.. ఈ చిత్రాలు ఎప్పుడు వస్తే అప్పుడే పండుగ అని ఇండస్ట్రీ జనాలు అనే మాట అతిశయోక్తి కాదు. కాబట్టి డిసెంబరు మొదటి వారంలోనే 'రాజా సాబ్'ను రిలీజ్ చేయడం మంచిదేమో.

# నా ఛాలెంజ్ ను యాక్సెప్ట్ చేస్తేనే కామెంట్స్ చేయండి





టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత గత కొన్నాళ్లుగా సినిమాల కంటే సోషల్ మీడియా పోస్టుల ద్వారానే ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్నారు. సోషల్ మీడియాలో తన శరీరాకృతి గురించి కామెంట్స్ చేసే వారికి సమంత గట్టి కౌంటర్ ఇచ్చారు. తనను విమర్శిస్తున్న వారికి ఫిట్‌నెస్ విషయంలో ఛాలెంజ్ చేస్తూ తాను జిమ్ లో చేస్తున్న పుల్ అప్స్ వీడియోను షేర్ చేశారు. రీసెంట్ గా సమంత ఓ అవార్డ్ ఫంక్షన్ లో పాల్గొనగా, ఆ ఈవెంట్ నుంచి పలు ఫోటోలు బయటకు రాగా, అందులో సమంత లుక్స్ చూసి చాలా మంది నెటిజన్లు సన్నగా అయిపోయావు, అనారోగ్యంగా కనిపిస్తున్నావంటూ కామెంట్స్ చేశారు. దీనిపై రెస్పాండ్ అవుతూ సమంత తన ఇన్‌స్టాలో ఓ స్టోరీని పెడుతూ తనను కామెంట్స్ చేసేవారికి సవాల్ విసిరారు. ఆ వీడియోలో సమంత ఎలాగైతే పుల్ అప్స్ చేశారో, తన గురించి నెగిటివ్ కామెంట్స్ చేసే వారు కూడా కనీసం మూడు పుల్ అప్స్ తీసి చూపించాలని, అలా చేసిన వాళ్లే తన గురించి కామెంట్స్ చేయాలని, లేని పక్షంలో తన గురించి మాట్లాడటం మానేయమని ఆ పోస్ట్ లో పేర్కొన్నారు సమంత. కాగా సమంత చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుంది. గత కొంతకాలంగా మయోసైటిస్ అనే ఆటో ఇమ్యూన్ వ్యాధితో బాధపడుతున్న సమంత, ఆ ట్రీట్‌మెంట్ లో భాగంగా తన ఒరిజినల్ లుక్ ను కాస్త కోల్పోయిన మాట నిజమే అయినప్పటికీ, నెటిజన్లు ఇష్టమొచ్చినట్టు కామెంట్స్ చేయడం ఏ మాత్రం కరెక్ట్ కాదు. ఇక సమంత కెరీర్ విషయానికొస్తే అమ్మడు త్వరలోనే రక్త్ బ్రహ్మాండ్ అనే సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సిరీస్ ఆగిపోయిందని గత కొన్నాళ్లగా వార్తలొస్తుండగా, ఈ సిరీస్ కు సంబంధించిన కీలక సీన్స్ ను ఆల్రెడీ ఫినిష్ చేశామని, త్వరలోనే ఓ భారీ అవుట్‌డోర్ షెడ్యూల్ ను ప్లాన్ చేసినట్టు డైరెక్టర్లు రాజ్ అండ్ డీకే క్లారిటీ ఇచ్చారు.

# మరో థ్రిల్లర్ తో వస్తోన్న ప్రియమణి

ఓ వైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు వెబ్‌సిరీస్‌లతో కెరీర్ ను ఫుల్ స్పీడులో నడుపుతున్నారు హీరోయిన్ ప్రియమణి. ది ఫ్యామిలీ మెన్, భామా కలాపం వెబ్ సిరీస్ లతో తనదైన నటనతో మెప్పించిన ప్రియమణి, రీసెంట్ గా ఆఫీసర్ ఆన్ డ్యూటీ అనే యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ లో నటించి బ్లాక్ బస్టర్ ను అందుకున్నారు. ఇప్పుడు తాజాగా ప్రిమయణి ప్రధాన పాత్రలో మరో వెబ్ సిరీస్ చేస్తోన్నారు. అదే గుడ్ వైఫ్. జులై 4 నుంచి జియో హాట్‌స్టార్ లో ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, తమిళ, హిందీ, మలయాళ భాషలు సహా ఏడు భాషల్లో గుడ్ వైఫ్ రిలీజ్ అవుతోంది. ఈ సిరీస్ లో ప్రియమణితో పాటూ సంపత్ రాజ్, రేవతి, ఆరి అర్జునన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రీసెంట్ గా గుడ్ వైఫ్ సిరీస్ కు సంబంధించిన ట్రైలర్ ను రిలీజ్ చేశారు మేకర్స్. గుడ్ వైఫ్ లో ప్రియమణి తరుణిక అనే తల్లి పాత్రలో నటిస్తున్నారు. అప్పటివరకు ఇద్దరు పిల్లలకు తల్లిగా ఉన్న ప్రియమణి సడెన్ గా కోర్టు రూమ్ లోకి లాయర్ గా మారడం



అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. గుడ్ వైఫ్ లో ప్రియమణికి భర్త పాత్రలో సంపత్ రాజ్ నటించగా, ఆయన స్కామ్ లో చిక్కుకుని అరెస్టవుతారు. భర్త అరెస్ట్ తో తరుణిక లైఫ్ ఒక్కసారిగా మారిపోతుంది. తన భర్తను కాపాడుకోవడానికి భార్య ఏం చేసింది? అసలామె లాయర్ గా ఎలా మారింది? ఈ ఒంటరి పోరాటంలో తరుణిక విజయం సాధించిందా? అసలు ఆమె భర్త అరెస్ట్ వెనుక ఇంకేదైనా కారణముందా లాంటి ప్రశ్నలు చాలా ఉన్నప్పటికీ ట్రైలర్ ఈ సిరీస్ పై ఆసక్తిని కలిగించింది. అమెరికన్ సిరీస్ ది గుడ్ వైఫ్ కు రీమేక్ గా ఈ సిరీస్ తెరకెక్కుతుండగా, నటి, డైరెక్టర్ రేవతి దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. గుడ్ వైఫ్ రీమేక్ గా తెరకెక్కుతున్నప్పటికీ ఇందులో కోర్టు సీన్స్, డ్రామా చాలా స్పెషల్ గా ఉండటంతో పాటూ ఇండియన్ నేటివిటీకి తగ్గట్టు చేసిన కొన్ని మార్పులు సిరీస్ కు ప్లస్ కానున్నాయి. ఇందులో ప్రియమణి లీడ్ రోల్ లో నటిస్తున్నప్పటికీ ఆమె అలా కనిపించకుండా, చాలా నేచురల్ గా ఒక సాధారణ కుటుంబంలోని భార్య, తన భర్త ఓ కేసులో ఇరుక్కుంటే ఏం చేస్తుందో అలానే కనిపిస్తూ చాలా సెటిల్డ్ గా నటించినట్టు అర్థమవుతుంది. జులై 4న ఈ సిరీస్ రిలీజ్ కానున్నప్పటికీ ఇంకా గుడ్ వైఫ్ కు కావాల్సినంత హైప్ రాలేదు. కానీ ట్రైలర్ రిలీజ్ తర్వాత మెల్లిగా సిరీస్ పై అందరికీ ఆసక్తి పెరుగుతుంది.

# చీరకట్టులో అందాల చి.ల.సౌ

సుశాంత్ హీరోగా రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రూపొందిన 'చి.ల.సౌ' సినిమాతో రుహాని శర్మ హీరోయిన్‌గా ఇండస్ట్రీకి పరిచయం అయింది. ఆ సినిమాలో నటిగా తన ప్రతిభను కనబర్చింది. సాధారణంగా హీరోయిన్స్ స్కిన్ షో చేస్తేనే గుర్తింపు లభిస్తుంది. కానీ ఈ సినిమాలో ఆమె పూర్తిగా పద్ధతైన పక్కింటి అమ్మాయిగా కనిపించినా కూడా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. అంతే కాకుండా ఇండస్ట్రీలోనూ మంచి గుర్తింపు సొంతం చేసుకుని వరుస సినిమా ఆఫర్లు దక్కించుకుంది. సోషల్ మీడియాలో ఈమెకు ఉన్న ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. హీరోయిన్‌గా ఒక మోస్తరు సినిమాల్లో నటించినప్పటికీ ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపుగా 15 లక్షల మంది ఫాలోవర్స్‌ను కలిగి ఉంది. రుహాని శర్మ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటో షూట్‌ను షేర్ చేస్తూ ఉంటుంది.



సాధారణంగా హీరోయిన్స్ ఇన్‌స్టాగ్రామ్‌లో స్కిన్ షో ఫోటో షూట్స్, బోల్డ్ లుక్ ఫోటోలు షేర్ చేస్తూ ఉంటారు. కానీ రుహానీ శర్మ మాత్రం చాలా అరుదుగా మాత్రమే స్కిన్ షో ఫోటోలు షేర్ చేస్తూ ఉంటుంది. ఎక్కువగా చీర కట్టు ఫోటోలు, నిండైన డ్రెస్‌లతో, ట్రెడీషనల్ లుక్‌లో కనిపిస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి చీర కట్టు ఫోటోలతో కన్నుల విందు చేసింది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ ఉంటారు. తాజా చీర కట్టు ఫోటోలతో చూపు తిప్పనివ్వడం లేదు. రుహాని శర్మ మరోసారి తన అందమైన చీర కట్టు ఫోటోలతో కవ్విస్తోంది. క్యాప్షన్ దొరకడం లేదు.. ఉత్తమమైనది ఆ స్థానాన్ని గెలుచుకుంటుంది నేను వేచి చూస్తున్నాను అంటూ తన చీర కట్టు ఫోటోలను షేర్ చేసింది. చీర కట్టు ఫోటోలతో ఎప్పటికప్పుడు రుహాని శర్మ ఆకట్టుకుంటూనే ఉంది. తాజాగా మరోసారి ఈ అమ్మడు చీర కట్టు ఫోటోల కారణంగా మరింతగా కవ్విస్తుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న రుహానికి దక్కాల్సిన స్థాయిలో ఆఫర్లు దక్కడం లేదు అంటూ అభిమానులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈమధ్య కాలంలో తెలుగులో ఈమె లవ్ మీ సినిమాలో నటించింది.





# సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీలు కట్టిన మహిళా మంత్రులు

హైదరాబాద్: రక్షాబంధన్ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మహిళా మంత్రులు రాఖీలు కట్టారు. మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పార్టీ నేతలు తదితరులు సీఎంకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తదితరులకు మంత్రి సీతక్క రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు.




హైదరాబాద్: స్వాతంత్ర్య పోరాటంలో క్విట్ ఇండియా ఉద్యమం కీలకమైందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా గాంధీభవన్‌లో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డూ ఆర్ డై నినాదంతో గాంధీ క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభించారన్నారు. కాంగ్రెస్ చరిత్రను తుడిచేయాలని భాజపా చూస్తోందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తోందన్నారు. రాజ్యాంగ సంస్థలతో ప్రతిపక్షాలపై కుట్రపూరిత దాడి చేస్తున్నారని దుయ్యబట్టారు. "ఎన్నికల కమిషన్ భాజపాకు అనుబంధ సంస్థగా మారింది. ప్రశ్నిస్తే దేశద్రోహులని ముద్ర వేస్తున్నారు. క్విట్ భాజపా అంటేనే దేశానికి భవిష్యత్తు. కాంగ్రెస్ పార్టీ దేశ రక్షణ కోసం పనిచేస్తోంది. భాజపా.. కులాలు, మతాల పేరిట భవిష్యత్తు లేకుండా చేస్తోంది. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక్క భాజపా, ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు లేడు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ చేయలేదని కేటీఆర్ ప్రమాణం చేయగలరా..? బండి సంజయ్ సవాల్



కరీంనగర్: ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకూ చర్యలు లేవని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. "భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పార్టీలు సహకరించుకుంటున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో రాధాకిషన్ రావు వాంగ్మూలంలో కేసీఆర్ పేరు చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని కవిత కూడా అన్నారు. ఆమెకు కూడా లీగల్ నోటీసులు ఇస్తారా..? తండ్రి, తాతా పేరు చెప్పుకొని నేను రాజకీయాల్లోకి రాలేదు. ఫోన్ ట్యాపింగ్ చేయలేదని కేటీఆర్ ప్రమాణం చేయగలరా..? కేటీఆర్‌కు సవాల్ విసురుతున్నా.. నేను నా కుటుంబం వచ్చి దేవుడి ముందు ప్రమాణం చేస్తాం. సొంత పార్టీ నేతలపైనే కేసీఆర్‌కు నమ్మకం లేదు. అప్పట్లో మంత్రులు, ఎమ్మెల్యేల ఫోన్లు ట్యాప్ చేశారు" అని బండి సంజయ్ అన్నారు.




## రానున్న ఏడు రోజుల్లో భారీ వర్షాలు..హెచ్చరించిన భారత వాతావరణ శాఖ

తెలంగాణ: రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భారత వాతావరణ శాఖ మరోసారి హెచ్చరిక జారీ చేసింది. తెలంగాణలో 9 నుంచి 15వ తేదీ వరకూ.. అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. రానున్న 7 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వర్షలు పడే ఛాన్స్ ఉందని స్పష్టం చేసింది.

వర్షాలకు సంబంధించిన సూచనలు, హెచ్చరికలను ఓ ప్రకటన ద్వారా వాతావరణ శాఖ విడుదల చేసింది. రాష్ట్రంలోని ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాలలో 10, 11 తేదీల్లో భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఆ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తుంది. 12, 13, 15 తేదీల్లో ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలలో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు(గాలి వేగం గంటకు 30-40 కి.మీ)తో కూడిన వర్షాలు అక్కడక్కడ కురుస్తాయని భారత వాతావరణశాఖ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అధికారులను అప్రమత్తం చేసింది. పోలీసులు, వివిధ విభాగాల అధికారులతో సహా.. కలెక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపింది. అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ.. ప్రజల రక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించింది. అధికారులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్ని పేర్కొంది.




పొదుపు ఖాతాల్లో మినిమమ్ బ్యాలెన్స్ లేనిపక్షంలో విధిస్తున్న అపరాధ రుసుమును ఇటీవల కొన్ని బ్యాంకులు ఎత్తివేస్తున్న సంగతి తెలిసిందే. కానీ ప్రైవేటు రంగ దిగ్గజ బ్యాంక్ ఐసీఐసీఐ మాత్రం అందుకు భిన్నంగా కస్టమర్లకు షాకిచ్చింది. సేవింగ్ అకౌంట్లలో కనీస సగటు నిల్వ మొత్తాన్ని పెంచేసింది. మెట్రో, అర్బన్, సెమీ అర్బర్, గ్రామీణ బ్రాంచ్ ఖాతాదారులందరిపై ఈ పెంపు ప్రభావం ఉంటుందని ఐసీఐసీఐ బ్యాంకు తెలిపింది. ఈ నిబంధన ఆగస్టు 1, 2025 నుంచే వర్తిస్తుందని స్పష్టం చేసింది. మారిన నిబంధనల ప్రకారం.. మెట్రో, అర్బన్ ప్రాంతాల్లో ఐసీఐసీఐ సేవింగ్ అకౌంట్ ఉన్నవారు ఇకపై తమ సగటు నిల్వలను కనీసం రూ.50వేలు ఉంచాలి. గతంలో ఈ పరిమితి రూ.10వేల వరకు ఉండేది. ఇప్పుడు దాన్ని ఏకంగా ఐదు రెట్లు పెంచేసింది. ఇక, సెమీ అర్బన్ కస్టమర్ల కనీస సగటు నిల్వ మొత్తాన్ని రూ.5వేల నుంచి రూ.25వేలకు పెంచింది. గ్రామీణ ఖాతాదారులకు రూ.2,500 నుంచి రూ.10వేలకు పెంచేసింది. ఖాతాదారులు ఎప్పటికప్పుడు తమ నిల్వలను సరిచూసుకోవాలని, కొత్త నిబంధనల ప్రకారం మినిమమ్ బ్యాలెన్స్ లేనిపక్షంలో ఛార్జీలు కట్టాల్సి ఉంటుందని ఐసీఐసీఐ వెల్లడించింది. ప్రస్తుతం దేశీయ బ్యాంకులు పొదుపు ఖాతాలపై అనుసరిస్తున్న కనీస సగటు నిల్వ మొత్తం నిబంధనల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. హెచ్‌డీఎఫ్‌సీలో గరిష్ఠంగా రూ.10వేల కనీస నగదు నిబంధనను (మెట్రో/అర్బన్ నగరాల్లో) అమలుచేస్తున్నారు. యాక్సిస్ బ్యాంక్‌లో అయితే ఈ మొత్తం రూ.12వేలు (మెట్రో/అర్బన్)గా ఉంది. మినిమమ్ బ్యాలెన్స్ లేకపోతే ఆయా కస్టమర్ల నుంచి బ్యాంకులు కొంత మొత్తంలో ఛార్జీలు వసూలుచేస్తున్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా.. ఈ ఛార్జీల నుంచి కొన్ని బ్యాంకులు మినహాయింపు కల్పించి ఖాతాదారులకు ఊరట కల్పిస్తున్నాయి. ప్రభుత్వ రంగ అతిపెద్ద బ్యాంకు ఎస్‌బీఐ.. 2020లోనే ఈ అపరాధ రుసుము నిబంధనను ఎత్తివేయగా.. ఇటీవల పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్ కూడా ఈ ఛార్జీలను తొలగించాయి.




జమ్మూకశ్మీర్‌లో పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ విమానాలు ఇటువైపు రాకుండా భారత్ తన గగనతలాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే. న్యూదిల్లీ తీసుకున్న నిర్ణయంతో పాక్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ భారీ నష్టాన్ని ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. పాక్ రక్షణ మంత్రిత్వశాఖ అసెంబ్లీలో సమర్పించిన నివేదికలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయని పలు మీడియా కథనాలు వెలువడుతున్నాయి. ఏప్రిల్ 24 నుంచి జూన్ 20 వరకు భారత్ గగనతలాన్ని మూసివేయడంతో రూ.4.10 బిలియన్లు(భారత కరెన్సీలో దాదాపు రూ.126 కోట్లు) నష్టం వాటిల్లిందని పేర్కొంది. భారత ఆంక్షల నేపథ్యంలో రోజుకు 100-150 విమానాలపై ప్రభావం పడిందని తెలిపింది. దీని కారణంగా విమానాల రాకపోకలు 20శాతం తగ్గిపోయాయని వెల్లడించింది. దీంతో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీకి వచ్చే ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపించినట్లు వివరించింది. పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం చోటుచేసుకున్న దౌత్యపరమైన ఉద్రిక్తతల్లో భారత్ సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతో పాటు గగనతలాన్ని మూసివేసిన విషయాన్ని గుర్తుచేసింది. ఇక, పాకిస్థాన్ విమానాలకు భారత్ తన గగనతలం మూసివేతను ఆగస్టు 24 వరకు పొడిగించిన సంగతి తెలిసిందే. పహల్గాంలో ఉగ్రదాడి ఘటనపై దేశమంతా ఆందోళన వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఉగ్రవాదులను పోషిస్తున్న పాక్‌పై భారత్ కఠిన చర్యలు తీసుకుంది. అందులోభాగంగా సింధుజలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతోపాటు పాక్ పౌరులు తక్షణమే భారత్‌ను విడిచివెళ్లాలని ఆదేశించింది. అనంతరం ఆ దేశ విమానాలు భారత్ గగనతలంపై ప్రయాణించకుండా ఆంక్షలు విధించింది. అంతకుముందు భారత్ విమానాలకు పాకిస్థాన్ తన గగనతలాన్ని మూసివేసింది. ఆ తర్వాత భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి.. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది.




కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 'ఇండియా కూటమి'సీనియర్ నేతలకు తన నివాసంలో ఇటీవల విందు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల చోరీకి సంబంధించి రాహుల్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇందులో పాల్గొన్న శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే చివరి వరుసలో కూర్చోవడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై భాజపా, శివసేన (యూబీటీ)ల మధ్య మాటల యుద్ధం నడిచింది. రాహుల్ నిర్వహించిన విందులో ఉద్ధవ్‌ను చివరి వరుసలో కూర్చోబెట్టడం ఆయన్ను అవమానించడమే అవుతుందని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ పేర్కొన్నారు. ఎన్డీఏతో కలిసి ఉన్నప్పుడు ఆయన ఎల్లప్పుడూ మొదటి వరుసలోనే కూర్చొనేవారని ఎద్దేవా చేశారు. తమకెప్పుడూ ఆయన గౌరవమే ప్రాధాన్యమన్నారు. కానీ, ఇండియా కూటమిలో ఆయనకు ఎలాంటి గౌరవం దక్కుతుందో చూస్తున్నామన్నారు. దిల్లీ ముందు తలవంచకూడదని ఆయన ఎప్పుడూ చెప్పేవారన్నారు. అధికారం లేని కారణంగా వారికి అలాంటి మర్యాద చేశారని, అది తనను బాధించిందన్నారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే మాట్లాడుతూ.. ఆత్మగౌరవాన్ని, బాల్‌ఠాక్రే ఆదర్శాలను వదిలేసినవారు ఇలాంటి అవమానాల గురించి పట్టించుకోరంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ వారి స్థానం ఏంటో తెలిసొచ్చేలా చేసిందన్నారు. భాజపా విమర్శలను ఉద్ధవ్‌సేన ఎంపీ సంజయ్ రౌత్ తిప్పికొట్టారు. ఉద్ధవ్‌ను ముందు వరసలోనే కూర్చోమన్నారని, టీవీ స్క్రీన్ సరిగ్గా కన్పించాలనే తాము చివరి వరుసలో కూర్చున్నామని తెలిపారు. ఇదే విషయంపై ఆదిత్య ఠాక్రే స్పందిస్తూ.. ఫడణవీస్, శిందేలపై విరుచుకుపడ్డారు. సమావేశంలో ఎక్కడ కూర్చోవాలనేది తమ సొంత నిర్ణయమన్నారు. వారికి చిరాకు పెట్టేది తమ సీటు గురించి కాదని, అక్కడ చర్చిస్తున్న అంశం గురించన్నారు. భాజపాతో కుమ్మక్కై ఎన్నికల సంఘం పనిచేస్తుందనే విషయాన్ని తాము బహిర్గతం చేయడాన్ని తట్టుకోలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. భాజపాతో సుదీర్ఘకాలం కలిసి పనిచేసిన శివసేన.. 2019 అసెంబ్లీ ఎన్నికల తర్వాత విడిపోయిన సంగతి తెలిసిందే. అటు ఉద్ధవ్ నుంచి విడిపోయిన ఏక్‌నాథ్ శిందే.. భాజపాతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. కొంతకాలం శిందే ముఖ్యమంత్రిగా, డిప్యూటీగా ఫడణవీస్‌లు కొనసాగారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా నేతృత్వంలోని మహాయుతి కూటమి అధికారం చేజిక్కించుకోగా.. ఫడణవీస్ ముఖ్యమంత్రిగా, డిప్యూటీగా శిందే బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఉద్ధవ్‌ను ఉద్దేశిస్తూ.. ఫడణవీస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విపక్షంలో కూర్చునేందుకు భాజపాకు అవకాశం లేదని, కానీ మీరు అధికార పక్షంలోకి రావచ్చంటూ పేర్కొన్నారు.




# ఆర్టీసీ బస్టాండ్లలో రాఖీ పండగ రద్దీ

హైదరాబాద్: రాఖీ పండగ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ నెలకొంది. హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లలో రద్దీ పెరిగింది. ఎంజీబీఎస్, సికింద్రాబాద్ జేబీఎస్‌లో బస్సుల కోసం ప్రయాణికులు నిరీక్షిస్తున్నారు. రాఖీ స్పెషల్ పేరుతో ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపుతోంది. ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఆంధ్రాకు వెళ్లే బస్సుల వద్ద జనం బారులు తీరారు. విజయవాడ బస్టాండ్‌లోనూ రద్దీ పెరిగింది.

**పండగ ఎఫెక్ట్.. ఉప్పల్ రింగ్ రోడ్ వద్ద ట్రాఫిక్ జామ్...** రాఖీ పండగ సందర్భంగా పెద్ద సంఖ్యలో నగరవాసులు సొంతూళ్లకు వెళ్తుండటంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ నెలకొంది. హైదరాబాద్-విజయవాడ రహదారిపై వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో వాహనాలు నెమ్మదిగా కదులుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు పండగ రద్దీతో ఉప్పల్ రింగ్ రోడ్ వద్ద ట్రాఫిక్ జామ్ నెలకొంది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com